
30CTR 2:30CTR 2.qxd 6/29/2026 11:42 PM Page 1



# రైతు సంక్షేమం కోసం పలు పథకాలు

## - పూతలపట్టు బండపల్లి వద్ద ఏరువాక పౌర్ణమిలో ఎమ్మెల్యే మురళీమోహన్




చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పలు పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోందని, వీటిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పిలుపునిచ్చారు. పూతలపట్టు మండలం బండపల్లి వద్ద సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ సహకారంతో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పూతపలట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ హాజరై నాగలి పట్టి పొలం దున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ దేశానికి, ప్రపంచానికి ఆహారం అందించే అన్నదాత నేడు ఆహాకారాలు చేస్తున్నాడని, ప్రభుత్వాలు అందించే సహాయం కోసం అర్రులు చాస్తున్నాడని, ఇది దేశానికి, సమాజానికి మంచిది కాదన్నారు. దేశం ఆకలిని తీర్చే అన్నదాత నేడు ఆర్థికంగా చితికిపోయి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీల కోసం, రాయితీల కోసం చేయి చాచడం దయనీయమైన పరిస్థితి అన్నారు. శాస్త్రవేత్తలు, మేధావులు పరిశోధనలు చేసి అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంను రైతులు అందిపుచ్చుకోడం లేదా లేక శాస్త్రవేత్తలు చెప్పే విషయాలు రైతులకు ఉపయోగపడటం లేదా! అని ప్రశ్నించారు. మార్కెట్ వున్నా, డిమాండ్ వున్నా, గిరాకీ వున్న, ఎగుమతులు చేసే అవకాశం వున్న పంటలవైపు రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేస్తూ, బీడు భూముల్లో పంటలు వేస్తూ పచ్చదనంతో భూమాతను కప్పాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా పిఎండిఎస్ విత్తనాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. అలాగూ రాస్ కెవికె శాస్త్రవేత్తలు ఖేత్ బచావో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీ, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శివశంకర్, ఆత్మా పిడి రామాంజనేయులు, రాస్ కెవికె శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, నాగరాణి, చంద్రబాబు, చిత్తూరు డివిజన్ వ్యవసాయ ఎడి ఉమామహేశ్వరి, ప్రకృతి వ్యవసాయ విభాగం అదికారులు నాంచారమ్మ, బాలకృష్ణ, హరికృష్ణారెడ్డిలు, తహసిల్దారు ఉదయ్‌సంతోష్, ఎంపిడిఓ నాగరాజు, మండల వ్యవసాయ అధికారి మధురవాణి, హేమలత, వనిత, వేణుగోపాల్, ప్రవీణ, దీప, వందన, తెలుగుదేశం పార్టీ నాయకులు భాస్కర్‌నాయుడు, ఇంద్రసేన నాయుడు, జగన్నాధనాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు చొరవ

## - ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

## - రైతులకు భూ పరిహారం చెక్కులు పంపిణీ !!



కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త
రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం గుడుపల్లె మండలం పొగురుపల్లి, దాసిమానిపల్లి పంచాయతీల్లో పారి శ్రామికవాడకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కృషితో కుప్పానికి భారీ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. వీటి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, రైతుల పంటలకు మార్కెటింగ్ వసతి, గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం మంచి పరిహారం అందిస్తోందన్నారు. రైతులు కూడా భవిష్యత్తును గుర్తుంచుకుని సిఎం చంద్రబాబు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. మున్ముందు పొగురుపల్లి ప్రాంతం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందుతుందని ఇందులో ఎలాంటి స ందేహం లేదన్నారు. భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, కార్పోరేషన్ డైరెక్టర్ బాబు,క్లస్టర్ ఇన్‌చార్జ్ బేటప్పనాయుడు, నాయకులు హేమాంబరగౌడు, ఎస్ఆర్ చంద్ర, విశ్వనాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధగిరిలో వైభవంగా జేష్టపౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, జూన్ 29 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం జ్యేష్టమాస పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# గణనాధుని సన్నిధిలో టంగుటూరు ఎమ్మెల్యే

కాణిపాకం, జూన్ 29 ప్రభాతవార్త:



టంగుటూరు ఎమ్మెల్యే మత్సమట్ల ధర్మరాజు సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు శివప్రసాద్, జనసేన నాయకులు పూల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలి



పెద్దపంజాణి జూన్ 29 ప్రభాతవార్త:
మండలంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ రామ్మూర్తి ఆదేశించారు.సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో బిఎల్‌ఒలు,సూపర్‌వైజర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఓటర్‌యెక్క2002డేటాతో ఎన్యుమరేషన్ ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదుచేసి ప్రస్తుత ఫోటో ఫారంలో అతికించి ఒకఫారం ఓటర్‌వద్ద ఉంచుకుని రెండవ ఫారం బూత్ లెవల్ అధికారికి అందజేయాలని సూచించారు.ఎన్యుమరేషన్ ఫారాలు భర్తీ చేయలేనివారు బిఎల్‌ఓల ద్వారా నమోదు చేయించుకోవచ్చాన్నారు.బిఎల్‌ఓలు కూడా ఎలాంటి పొరబాట్లకు తావివ్వరాదని సూచించారు.ప్రజలు కూడా ఏదైనా సందేహాలు ఉంటే బిఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒలు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# కిల్లి రవి ఆత్మహత్య కేసులో ఉషారాణి అరెస్టు

రేణిగుంట జూన్ 29 ప్రభాతవార్త
రేణిగుంట పట్టణానికి చెందిన సి ఆర్ యస్ ఉద్యోగి కిల్లి రవి ఆత్మహత్య కేసులో ఉషారాణిని రేణిగుంట అర్బన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల సి ఆర్ యస్ ఉద్యోగి కిల్లి రవి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. మృతుని వద్ద లభించిన సూసైడ్ నోట్, పోస్ట్ మార్టం నివేదికలు అనంతరం సేకరించిన ఆధారాలు సాక్షుల వాంగ్మూలాలు పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. తిరుపతి మంగళ నివాసి ఉషారాణిని సోమవారం ఉదయం రేణిగుంట మండలం కరకంబాడి బస్టాండ్ సమీపంలో అర్బన్ ఎస్ఐ వై శ్రీనివాసులు అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ఆత్మహత్యపై ఆమె నుండి వివరాలు సేకరించి తరువాత చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ న్యాయస్థానం లో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు..


# పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 56 సమస్యలు



చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో ఆపరేషన్ ఎఎస్పీ ఎస్.షాను సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి సమస్యలపై 56 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షాను సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షానుతో పాటు చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భూత గాదాలకు సంబంధించి అత్యధికంగా 9 అర్జీలు అందగా, కుటుంబ తగాదాలు 8, వేధింపులు 8, డబ్బు తగాదాలు 5, పోలీసు సేవలు 7, ఆస్తి తగాదాలు 6, చీటింగ్ 3, ఇంటి తగాదాలు 2, మిస్సింగ్ కేసులు 2, చిన్న తగాదాలు 2, బెదిరింపులు 2, భర్త వేధింపులు 1, బైక్ దొంగతనంపై ఒక ఫిర్యాదు అందింది.

# విభజన అనంతరం టీచర్ల సర్దుబాటు

## - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్



చిత్తూరుహెల్త్, జూన్ 29 ప్రభాతవార్త:
జిల్లాల విభజన నేపథ్యంలో ఉపాధ్యాయులను ఆయా జిల్లాలకు కేటాయించిన అనంతరం సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయులను పాఠశాలలకు కేటాయిస్తే విభజనలో వారు ఇతర జిల్లాకు వెళితే వృధా ప్రయాస అవుతుందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి నుండి వస్తున్న విజ్ఞప్తుల మేరకు మార్పులు, చేర్పులు చేయకుండా సర్దుబాట్లు చేయడం తొందరపాటు చర్య అని మండిపడ్డారు. రాష్ట్ర విద్యాశాఖ పూటకో ఉత్తర్వులతో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియను గందరగోళంగా మార్చివేసిందని ఆయన వాపోయారు. ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల వివరాలు ఇంకను యూడైస్ నందు నమోదు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు యూ డైస్ నందు పేర్లు తొలగించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే హైస్కూల్ ప్లస్‌లకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. జులై చివరినాటి విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాత్రి 10 గంటల్లోపు వ్యాపార సంస్థలు మూత

## - వరిగిపల్లి జంక్షన్‌లోని దుకాణదారులకు యాదమరి పోలీసులు హెచ్చరిక

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:
చెన్నై-తిరుపతి-బెంగళూరు వరిగిపల్లి జంక్షన్, జాతీయ రహదారి పరిసరాల్లో వ్యాపార సంస్థలు తమ దుకాణాలను రాత్రి 10 గంటలలోపు మూసి వేయాలని యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అక్రమ రవాణా కట్టడి చర్యల్లో భాగంగా యాదమరి మండల పరిధిలోని వరిగిపల్లి జంక్షన్, జాతీయ రహదారి వెంబడి వున్న హోటళ్ళు, టీ దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు అన్ని రాత్రి 10 గంటల్లోపు తప్పనిసరిగా మూసి వేయాలన్నారు. ఇటీవల కాలంలో గంజాయి, బియ్యం, ఇసుక, గ్రానైట్ తదితర అక్రమ రవాణాలకు పాల్పడుతున్న కొంతమంది వ్యక్తులకు మరికొంతమంది ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల్లో పైలెట్లుగా వ్యవహరిస్తూ పోలీసు కదలికలను వారికి చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించడం జరిగిందన్నారు. వీరు హోటళ్ళు, టీ దుకాణాల వద్ద సాధారణ వినియోగదారుల తరహాలో నిలబడి వుండటం వల్ల వీరిని గుర్తించడం పోలీసులకు ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే చిత్తూరు నగర పరిధిలో ఇళ్ళ దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడే వారు సైతం ఈ ప్రాంతంలోని హోటళ్ళు, టీ దుకాణాలను ఆశ్రయించి అనుమానం రాకుండా సంచరిస్తుట్లు పోలీసులు గుర్తించడం జరిగిందన్నారు. వరిగిపల్లి జంక్షన్‌లో, హైవే వెంబడి ఎవరైనా రాత్రి 10 గంటలకు పైబడి దుకాణాలు తెరచి వుంచి వ్యాపారాలు నిర్వహిస్తే ఆ యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఈశ్వరయ్య హెచ్చరించారు.

# ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానం

తిరుపతి కలెక్టరేట్, జూన్ 29 ప్రభాతవార్త :



ఏపీ పీటీడిలో 40 ఏళ్లు వివిధ హోదాల్లో పనిచేసిన పి. సురేంద్రరెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం తిరుపతి డిపో గ్యారేజీలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కండక్టర్‌గా చేరి తిరుపతి డిపోలో టీఐ3 గా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి దంపతులను పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు, పీ టీడీ అధికారులు, ఉద్యోగులు సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. పీటీడీ వైఎ స్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు చంద్రయ్య, ఎంటీఆర్ రెడ్డి, లతారెడ్డి కే పరంధామ్,, జి నరసింహులు, పి .రాంబాబు, కె .మాధవయ్య పాల్గొన్నారు

# తిరుపతిరూరల్‌లో ఫ్లెక్సీల రగడ

## -పంచాయతీ సిబ్బందికి వైసిపి కార్యకర్తల మధ్య వాగ్వివాదం



తిరుపతిరూరల్,జూన్ 29 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలంలో ఫ్లెక్సీలు తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం రాత్రి నుంచి తిరుపతిరూరల్ పరిధిలోని వెంకటపతినగర్, పేరూరు, తిరుచానూరు ప్రాంతాల్లో ఈ ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శులపై రాజకీయ ఒత్తిడి వచ్చిందనే కారణంగా నియమావళి మేరకు వాటిని తొలగించాలని అధికారులు సిబ్బందికి ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఫ్లెక్సీలు తొలగించేందుకు వచ్చిన పంచాయతీ సిబ్బందికి వైసిపి కార్యకర్తలు, స్థానిక నాయకులు అడ్డుపడటంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. పేరూరులో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వచ్చారు. ఈ ఘటనతో తిరుపతిరూరల్ మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

# అభయాంజనేయ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



పలమనేరు, జూన్ 29 ప్రభాతవార్త
పలమనేరు శివార్లలోని అభయాంజనేయ స్వామి గుడికి సోమవారం భక్తులు పోటెత్తారు. పౌర్ణమి కావడంతో అధిక సంఖ్యలో హాజరై విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రీతి పాత్రమైన తమలపాకులతో హారాలు వేసి అలంకరించారు. అలాగే ఉదయం అల్పా హారం నుండి మధ్యాహ్నం. రాత్రి కూడా భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కీర్తనలు భజనలతో జాగారం చేశారు. దాతల సహకారంతో ఇక నుండి ప్రతి నెలా పౌర్ణమి రోజున అన్నదానం భజనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

# పిజిఆర్ఎస్‌లో 54 వినతులు

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త



కడ పి.డి. వికాస్ మర్మత్ ఆదేశాలతో స్థానిక మండల కార్యాలయంలో కడ అధికారి శివయ్య ప్రజా సమస్యల పరిషా ్కర వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 54వినతిపత్రాలు అందించారు. వీటిలో రెవెన్యూ 18, పెన్షన్లకు 7, పి4కు 4, సర్వే శాఖకు 7 వినతులు అందాయి. కాగా రామకుప్పం మండలంలో 390/1,390/2,309/7 సర్వే నెంబరులోని భూములకు సంబంధించి ఇతర మండలాల వారికి పట్టాలు మంజూరు చేశారని ఈవిషయంగా దళితులకు న్యాయం చేయాలని ఎంఆర్‌పిఎస్ నేతలు వినతిపత్రం అందించారు.

# ఓటర్ల జాబితాలో తప్పులకు అవకాశం ఇవ్వరాదు

## - కడ సభ్యుడు రాజ్‌కుమార్



కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త
ఓటర్ల జాబితాలో తప్పులకు అవకాశం ఇవ్వకుండా బిఎల్‌ఒలు, బిఎల్ఎలు చొరవ చూపాలని కడ సభ్యుడు రాజ్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన మున్సిపల్ పరిధి 161,162 బూత్‌లు అయిన పాతపేట, మున స్వామిపురం ప్రాంతాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమంను పరిశీలించారు. ఈసందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని బిఎల్‌ఒలకు సూచించారు. చనిపోయిన వారి ఓట్లు తొలగింపుకు చర్యలు చేపటా ్టలని బిఎల్‌ఒలను కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చింతలరేవు అటవీ ప్రాంతంలో జంట ఏనుగులు

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త
రామకుప్పం మండలంలో పంట పొలాలను ధ్వంసం చేసిన జంట ఏనుగులు కుప్పం మండలం చేరాయి. రామకుప్పం నుంచి బయలుదేరిన ఏనుగులు ఆదివారం రాత్రి కుప్పం మండలం నాయనూరు అటవీ ప్రాంతంలోకి చేరాయి. సోమవారం సాయంత్రం నాటికి ఏనుగులు నాయనూరు అటవీ ప్రాంతంనుంచి నూలుకుంట అటవీ ప్రాంతంలో ఉన్న చింతలరేవు ప్రాంతంలో మకాం వేశాయి. కాగా ఏనుగులు కొత్తపల్లి, గరిగచీనేపల్లి, మిట్టపల్లి తదితర గ్రామాల వైపు వచ్చే అవకాశం ఉండడంతో ఎఫ్ఆర్వో జయశంకర్, డిఆర్వో సమీర్ బాషా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రాత్రిపూట రైతులు ఎవరూ పొలాల వైపు వెళ్లరాదని హెచ్చరించారు. కాగా జంట ఏనుగులను తమిళనాడు అటవీ ప్రాంతంలో తరిమేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు.

# రైతులకు రాయితీతో దాణా పంపిణీ

రామకుప్పం, జూన్ 29 ప్రభాతవార్త



మండలంలోని చెల్దిగానిపల్లిలో పాడి రైతులకు ప్రభుత్వం తరపున రాయితీతో దాణాను యూనిట్ కోఇన్‌చార్జ్ రెడ్డి పురుషోత్తం పంపిణీ చేశారు. ప్రభుత్వం యాభై శాతం రాయితీతో దాణాను అందిస్తోందన్నారు. పాడి రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు, రైతులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్‌లో స్వర్ణోత్సవాలు



రామకుప్పం, జూన్ 29 ప్రభాతవార్త
స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద స ్వర్ణోత్సవ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సహకార శాఖ పతాకాన్ని ఆవిష్కరించారు. పిఎసిఎస్ ఛైర్మన్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు రూ. 8 కోట్ల పరిహారం అందజేత



రామకుప్పం, జూన్ 29 ప్రభాతవార్త
మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంకు భూములిచ్చిన రైతులకు సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు 8కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. సుమారు 42 ఎకరాలను అధికారులు సేకరించారు. టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ రామకుప్పం మండలంలో పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కోట్ల రూపాయలతో పరిశ్రమలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కడ ఎపిడి శ్రీనివాసులు రాజు, తహశీల్దార్ కౌలేష్, నేతలు సీతాపతి, కామరాజు నాయక్, రఫీ, రవిరెడ్డి, మునిరెడ్డి, పెరుమాళ్, గిరి, భాస్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సు ప్రారంభం


వి.కోట, జూన్ 29 ప్రభాతవార్త



మండలంలోని గ్రామీణ ప్రాంతాలైన ఏడుచుట్లకోట, చింతమాకులపల్లి, బిసిపల్లి గ్రామాల మీదుగా నాయకనేరి వరకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును సోమవారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రామ చంద్రనాయుడు ప్రారంభించారు. ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి సూచనలతో కుప్పం డిపో మేనేజరును కలసి ప్రజల ఇబ్బందులు వివరించగా ఆయన బస్సు సర్వీసు ఏర్పాటుచేశారన్నారు. దీంతో విద్యార్థులు, రైతులు, ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వర్ గౌడ్, ఇక్బాల్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

30 -6Pg9th cheli:30 -6Pg9th cheli.qxd 6/29/2026 11:39 PM Page 1





## ముత్యమంత మొటిమే కదా!

అందంగా మెరిసే ముఖంపై చిన్న మొటిమ వచ్చినా అమ్మాయిలకు ముచ్చెమటలు పోస్తాయి. ఇందుకు హార్మోన్ల ప్రభావంతో పాటు అధిక జిడ్డు, దుమ్ముధూళీ, **ఆహారపుటలవాట్లు..** వంటి ఎన్నో కారణాలు. అలాగని వీటిని తగ్గించుకోవడానికి ఖరీదైన క్రీములు వాడుతున్నారా? అవేం అక్కర్లేదు.. ఇంట్లోని పదార్థాలతో ఈ చిట్కాలు పాటించి చూడండి. దాల్చిన చెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలకు కారణమైన బ్యాక్టీరియాని చంపేస్తాయి. రెండు చెంచాలు తేనె, కాసిని పాలు, చెంచా దాల్చిన చెక్కపొడి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో ఇలా చేయడంవల్ల మొటిమలు తగ్గడమే కాదు, మచ్చలూ పోతాయి. జిడ్డుని తొలగించి మొటిమలు రాకుండా బొప్పాయి అడ్డుకుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జులో పంచదార, పెరుగు కలిపిముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. అపై గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. రెండు చెంచాల నారింజ తొక్కల పొడికి తగినన్ని పాలు చేర్చి ముఖానికి రాసి ఇరవై నిమిషాల తరవాత కడిగేయాలి. వీటితో మొటిమలు తగ్గడమే కాదు చర్మం కొత్త మెరుపుతో కనిపి స్తుంది. కలబంద గుజ్జులో కాస్త నిమ్మరసం తేనె కలిపి రోజూ రాసి ఆరనివ్వండి ఇలా పదిహేను రోజులు చేస్తే క్రమంగా మొటిమలు తగ్గుముఖం పడతాయి. □



## ఒత్తిడికి దూరంగా..

ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం. కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ ప్రక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ వ్యాయామం నాడీవ్యవస్థను నెమ్మదింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది. చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది. మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి. కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతుక్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి.లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి, ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడటమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి. □



## శశి కాంచనం

నారీమణులకు నగలంటేనే ముఖం వెలిగిపోతుంది. కానీ ఒకామెకు కళ్లు చెదరగొట్టే అమూల్య ఆభరణాలు తనకు తారసపడినా చలించలేదు. ఎక్కడో ఆలోచనలో మెదడు పాడుచేసుకోలేదు. దానిని సొంతదారులకందించే వరకు నిద్రలేదంటే నమ్మండి. ఆమెలోని నిజాయితీ మహిళాలోకానికి మకుటాయమానం. జీవనోపాధికి చేస్తున్న ఉద్యోగం చిన్నదే అయినా కళ్లెదుట 'కనకపు సంచి' మెరుస్తూనే ఉన్నా ఆమె మనసు పాడుచేసుకోలేకపోవడమే ఇక్కడ చెప్పుకోవాలి. . ఆమె అభినందనీయురాలు. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం తిరుపతిలో పెళ్లి వేడుకలో ఘనంగా నిర్వహించుకుని తిరుగు ప్రయాణ సమయంలో ఓ హ్యాండ్ బ్యాగ్ మరచిపోయారు. తీరా ఇంటికి చేరుకున్నాక దాదాపు 45 లక్షల రూపాయల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలున్న హ్యాండ్ బ్యాంగ్ ఎక్కడో ఏ హోటల్‌లోనో పొగొట్టుకున్నాట్లు గుర్తించి ఆందోళన చెందారు. విషయం పోలీస్‌ల దాక వెళ్లి పెళ్లివారు చివర్లో ఆగిన తిరుపతి గరుడాద్రి హోటల్ క్యాషియర్ శశిని అడగ్గా ఆమె నోటివెంట పలికిన పలుకులు ఇక్కడ ప్రస్తావనార్హం. ఔను! ఒక హ్యాండ్ బ్యాగ్ దొరికింది. భద్రంగా దాచి ఉంచాం ఇదిగో! దాంతో పోయిన నగల సంచి సొంతదారుకు చేరింది. దాంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. శశి విధి నిర్వహణలో నిబద్ధత, బాధ్యత నిజాయితీని మెచ్చుకుని జిల్లా ఎస్పి సుబ్బారాయుడు శాలువాతో సత్కరించారు. □

## దానాలు ఫలించాలంటే..

**దానం ఓ మహత్తర కార్యం.** నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొందవచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరాలకు కొంత మంది, వాళ్లు అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హతమార్చడం చేస్తున్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుంటారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్లు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పన్నులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానాలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంధాలలో, వివిధ సగ్రంథాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో. □



## ఎక్స్‌పైరీ తేదీ చూడాలి!

మార్కెట్‌కెళ్లి ఏదైనా కొనుగోలు చేయాలంటే మనమేం చేయాలి. రూపొందించిన కంపెనీల లోగోలు చూద్దామా? ఏది తక్కువకు లభిస్తుందో బేరీజు వేసుకుంటారా.. అవన్నీ తర్వాత మనమైతే ముందు ఎక్స్‌పైరీ తేదీని గమనించాలి.

**రెండింటి మధ్య తేడా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్యస్వల్ప వ్యత్యాసం ఉంటుంది.

**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణా లతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు. షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్త పచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి. □

**చిట్కా :**
- ✦ అవకాయపచ్చడి జాడీలో కొంచెం బెల్లంపొడిపైన చెల్లితే బూజుపట్టదు.
- ✦ అటకులు రుచిగా వుండాలంటే కొబ్బరి కోరు యాలకులపొడి కొద్దిగా కలపండి.
- ✦ అల్లపురసమును తేనెతో కలిపి త్రాగిన ఎక్కిళ్లు పోవును.

## చిలగడ దుంప బజ్జీలు!

**కావలసిన పదార్థాలు:**
శనగపిండి: కప్పు
బియ్యప్పిండి: అరకప్పు
వాము: పావు స్పూను
కారం: ఒక స్పూను
ఉప్పు: తగినంతసోడా ఉప్పు:
చిటికెడుచిలగడ దుంపలు: పెద్దవి
రెండునూనె: వేయించడానికి సరిపడా

**తయారీ విధానం :** ముందుగా చిలగడ దుంపలను శుభ్రంగా కడిగి పల్చగా పొడవాటి ముక్కలుగా తరిగి నీళ్లలో వేసి పక్కకు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శనగపిండిని తీసుకోవాలి. అందులో ఉప్పు, వాము, సోడా, కారం వేసి కొద్దిగా నీళ్లు పోయాలి. అంటే బజ్జీ వేసేందుకు వీలుగా జారుడుగా పిండి వచ్చేలా ఈ నీళ్లను పోసుకోవాలి. తర్వాత పిండిలో అన్నీ కలిసేలా బాగా కలియబెట్టాలి. ఎంత కలిపితే బజ్జీలు అంత గుల్లగా వస్తాయి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా కాగాక, ఇందాక కలిపి పెట్టుకున్న పిండిలో చిలగడదుంప ముక్కలను ముంచి అందులో వేయాలి. మంట తక్కువగా పెట్టి కాలిస్తే లోపలి చిలగడదుంప కూడా చక్కగా ఉడుకుతుంది. □





## 'ENE Repeat' నవంబర్ 19న రిలీజ్



యూత్ లో చెరగని ముద్ర వేసుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం ఇప్పుడు సీక్వెల్ ENE Repeat తో సిద్ధమవుతోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఆ మ్యాజిక్‌ను మళ్లీ క్రియేట్ చేయడానికి రీయూనియన్ అవుతుండగా, శ్రీనాథ్ మాగంటి ఈ టీంకు కొత్త ఉత్సాహాన్ని జోడిస్తున్నారు. తరుణ్ భాస్కర్ మరోసారి దర్శకత్వం వహిస్తుండగా, ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్త నవంబర్ 19ని విడుదల కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. చిత్రం (మొదటి భాగం) విడుదలై ఎనిమిది ఏళ్ల పూర్తయిన సందర్భంగా, ఆనాటి 'కన్యా రాశి' గ్యాంగ్ జ్ఞాపకాలను గుర్తు చేసేలా, అందరినీ ఆకట్టుకునే ఫ్రెండ్షిప్ యాంథమ్ నేపథ్యంతో ఒక 'ఫీల్ గుడ్' వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది.? పార్ట్ వన్ లోని ప్రత్యేకతను కొనసాగించేలా ఈ సీక్వెల్‌కు ట్యాలెంటెడ్‌టెక్నికల్ టీం పని చేస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా, ఏజే ఆరోన్ సినిమా టోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటింగ్ చేస్తుండగా, రాజేష్ పెంటకోట, సాలీ వైట్ ప్రొడక్షన్ డిజైన్‌ను రూపొంది స్తున్నారు .విడుదల తేదీని ప్రకటించిన నేపథ్యంల త్వరలోనే చిత్ర ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## #RAPO23 పూజా కార్యక్రమంతో షూటింగ్ ప్రారంభం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక మైన చిత్రం #RAPO23 అధికారికంగా లాంచ్ చేశారు. ఎన్నో ఏళ్ల పాషన్, ప్లానింగ్ తో రూపుదిద్దుకున్న ఈ చిత్రంతో రామ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది. ఈ చిత్రం ఈరోజు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. నిర్మాత కృష్ణ పోతినేని స్క్రిప్ట్ ను రామ్ పోతినేనికి అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి పి. మురళీ మోహన్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, పి.వి. రవి కిషోర్ క్లాప్ కొట్టారు. దర్శకుడిగా తన ప్రయాణానికి శ్రీకారం చుడుతూ తొలి షాట్‌కు రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ఈ రోజు హైదరాబాద్ శివార్లలో ప్రారంభమైంది. కథానాయకుడు రామ్ పోతినేని చిత్రంలోని ప్రధాన తారాగణంతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటు న్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఒరిజినల్ కథను స్వయంగా రామ్ పోతినేని రాశారు. నియోనోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని విభిన్న అంశాలను, ఆసక్తికరమైన పాత్రల ప్రయాణంతో ఈ చిత్రం ఉండబో తోంది. దర్శకత్వం, కథతో పాటు ఈ చిత్రంలో రామ్ కథానాయకుడిగానూ నటిస్తున్నారు. కెమెరా ముందు, వెనుక బాధ్యతలు చేపట్టడం ద్వారా ఈ ప్రాజెక్ట్‌పై ఆయనకున్న అంకితభావం స్పష్టమవు తోంది. తన కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రను ఆయన ఇందులో పోషించబోతున్నారు.

## 'నాగబంధం'లో స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను: నభా నటేష్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.

**నాగబంధంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**
ఇప్పటివరకు ఇలాంటి పాత్ర నేను చేయలేదు. ఇందులో నేను పార్వతి పాత్రలో కనిపిస్తాను. తను ఒక వేద విద్యార్థిని. తన పాత్ర ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది.

**ఇందులో చాలా గ్రాండ్‌గా చిత్రీకరించిన డాన్స్ నంబర్ ఉంది కదా... దాని గురించి చెప్పండి?**
ఆ పాట చేయడం నిజంగా అద్భుతమైన అనుభవం. దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో ఆ పాటను గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. అందులో క్లాసికల్ డాన్స్ కూడా ఉంటుంది.

**డైరెక్టర్ అభిషేక్ నామా గురించి?**
అభిషేక్ గారికి చాలా క్లియర్ విజన్ ఉంది. ఆయన ఈ కథను చాలా అద్భుతంగా ఊహించుకున్నారు. ఈ సినిమాలో నా పాత్ర కోసం రెడీ అవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకున్నారు. ఈ షూటింగ్‌ను నేను చాలా ఎంజాయ్ చేశాను. అనంత పద్మనాబ స్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేమంతా చాలా నియమనిష్ట లతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం.

**ఇందులో మీ పాత్రలో రొమాన్స్ కూడా ఉంటుందా?**
రొమాన్స్ ఉంటుంది. అయితే దానికంటే చాలా ముఖ్యమైన అంశాలు నా పాత్రలో ఉంటాయి. అవే కథకు కీలక మలుపు తీసుకొస్తాయి.

**నిర్మాతల గురించి?**
తొలి సినిమానే అయినప్పటికీ కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో దాదాపు రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రతి విషయంలో రాజీ పడకుండా, కంటెంట్‌కు తగ్గట్టుగా సినిమాను తీర్చిదిద్దారు. ప్రమోషన్స్ కూడా చాలా వినూత్నంగా చేశారు. .

**విరాట్ కర్ణ గురించి?**
విరాట్ కర్ణ చాలా ప్యాషన్, డెడికేషన్ ఉన్న నటుడు. ఇది ఆయన రెండో సినిమా అని అనిపించదు. ఎంతో అనుభవం ఉన్న నటుడిలా నటించారు.

**'నాగబంధం' షూటింగ్ అనుభవం?**
నాగబంధం చాలా భారీ స్థాయి సినిమా. ప్రతిరోజూ షూటింగ్‌లో దాదాపు 200 మంది ఉండేవారు. ప్రతి షెడ్యూల్‌కు సినిమా స్కేల్ మరింత పెరుగుతూ వెళ్లింది.



## 'మకుటం' విజయం సాధించాలి: విశాల్


సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం మకుటం. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ ది రైజ్ ఆఫ్ లింగా అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఆదివారం (జూన్ 28) నాడు సెకండ్ సింగిల్ నచ్చాకే వచ్చేరా అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో.. విశాల్ మాట్లాడుతూ.. .. 'మకుటం'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నందుకు ఆనందంగా ఉంది. ఈ సారి దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. శివ్వ చూసిన తరువాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. ఈరోజు ఆర్‌బీ చౌదరి గారిని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ..అంజలి మాట్లాడుతూ.. .. మదగదరాజా తరువాత విశాల్‌తో కలిసి మకుటం చేశాను. అప్పుడు విశాల్ హీరో.. ఇప్పుడు దర్శకుడు కూడా. ఇందులో నేను ఓ మంచి, పవర్ ఫుల్ రోల్‌ను పోషించాను. విశాల్ నా పాత్రను గొప్పగా తీశాడు. ..జితన్ రమేష్ మాట్లాడుతూ.... విశాల్ మాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. మా ఇంట్లో వ్యక్తిలా, సొంత అన్నలా ఉంటాడు. జీవీ ప్రకాష్ పట్టిందల్లా బంగారం అవుతుంది. మా 'మకుటం' మ్యూజిక్ కూడా పెద్ద హిట్ అవుతుందని అనుకుంటున్నాను. ..నటి ఝూన్సీ మాట్లాడుతూ.. నన్ను తమిళంలో పరిచయం చేస్తున్న విశాల్‌కి థాంక్స్. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. హీరోగా, దర్శకుడిగా అన్ని రకాలుగా విశాల్ ఈ చిత్రంతో అద్భుతం చేశారు.

## 'కళ్యాణం కమనీయం జీవితం" పోస్టర్ విడుదల



వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరోయిన్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్‌రావు కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం కళ్యాణం కమనీయం జీవితం. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ: టైటిల్ చాలా బాగుంది. రాజవంశీ టైటిల్ గురించి చెప్పగానే చాలా ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు .డైరెక్టర్ విజన్ పోస్టర్ ద్వారా తెలుస్తుంది. హీరో హీరోయిన్ లకు సినిమా టీమ్ కు అల్ ది బెస్ట్ అని అన్నారు నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ : విజయేంద్ర ప్రసాద్ గారు అడగగానే మా పోస్టర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది ఆయనకు నా కృతజ్ఞతలు. డైరెక్టర్ కథ చెప్పగానే తప్పకుండా ఈ సినిమా చేయాలి అనిపించింది. దర్శకుడు చెప్పిన విధంగా సినిమా తీశాడు సినిమా తప్పకుండా అందరికీ నచ్చు తుంది అని అన్నారు మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ పాన్ వరల్డ్ స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ గారు పోస్టర్ ను ఆవిష్కరించి టీమ్ కు బ్లెస్సింగ్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మంచి కథ, కథనాలతో సినిమాని తెరకెక్కించాము త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము అన్నారు

## 'స్టూడెంట్' మూవీ టీజర్ రిలీజ్



స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'స్టూడెంట్' ఈ సినిమాలో విజేత పరేక్ హీరోయిన్ గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. 'స్టూడెంట్' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవు తోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. "స్టూడెంట్' సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి) ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరుపున పాలిటిక్స్ లోకి రావడం కాలేజ్ లో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. పాలిటిక్స్‌కు కొత్తైనా రాజకీయాల్లో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకుంటాడు భాను. పక్కనోడు కత్తితో యుద్ధం చేస్తున్నప్పుడు మనం చెయ్యి పెడితే తెగిపోద్ది, మనం పాలిటిక్స్ లో ఉన్నాం, ఇక్కడ ఎథిక్స్ ఉండవు, ఓన్లీ ట్రిక్సే ఉంటాయి. అంటూ మేఘాంశ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ టీజర్‌కు హైలైట్ గా నిలుస్తోంది. స్టూడెంట్ రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది ఇంపాక్ట్ ఫుల్‌గా చూపించారు.

30-6Pg8exHMNWJQEVRS:30-6Pg8exHMNWJQEVRS.qxd 6/30/2026 12:19 AM Page 1



## ఆర్టీసీ బస్సు ప్రమాదఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రవిచారం

### గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** వనపర్తి సమీపంలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రవిచారం వ్యక్తం చేశారు. వనపర్తి డిపోకు చెందిన టిజి 32 జడ్ 0015 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం ఉదయం కర్నూలు నుండి వనపర్తికి వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో జాతీయ రహదారి 44పై ప్రమాదానికి గురైన ఘటన పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులందరికీ మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం లో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిసిందని, వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు.

ప్రమాదం జరిగిన వెంటనే ఆర్‌టీసీ అధికారులు, పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. ప్రమాద ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ నిర్వహించి, పూర్తి నివేదిక సమర్పించాలని ఆర్‌టీసీ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షి ంచారు.



వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో సోమవారం ఉదయం బోల్తా పడిన బస్సు

## పెబ్బేరులో ఆర్టీసీ బస్సు బోల్తా

### ఒకరు మృతి, పలువురికి తీవ్రగాయాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త:** మంత్రాలయం నుంచి వనపర్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారి 44పై పెబ్బేరు సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా పెబ్బేరు సమీపంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్ పైకెక్కి బోల్తా కొట్టింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ప్రయాణీకులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పెబ్బేర్ ఎస్సై వెంకటేష్ గౌడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులను సురక్షి తంగా బయటకు తీశారు. 108 అంబులెన్స్ లో వనపర్తి పెబ్బేరు ప్రభుత్వ దవాఖానాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని కర్నూలు దవాఖానకు తరలించారు. అదే సమయంలో హైదరాబాద్ వెళ్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వెంటనే బస్సు వద్దకు చేరుకొని క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి దవాఖాన కు తరలించారు. బస్సు వేగం తక్కువగా ఉండడంతో ప్రమాద తీవ్రత తగ్గి ఎలాంటి ప్రాణాపాయం ఏర్పడలేదు.

## ఇహెచ్‌ఎస్‌కి ప్రభుత్వోద్యోగులు మూలవేతనంలో 1.5 శాతం చెల్లించాలి

### పెన్షనర్లు పెన్షన్‌లో 1.5 శాతం ఇవ్వాలి

### తప్పనిసరిగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, పెన్షనర్లకు నూతనంగా అమలు చేయనున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కి సంబంధించి ఉద్యోగులు, పెన్షనర్ల మూలవేతనం నుంచి 1.5శాతం చెల్లించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ తమ మూల వేతనం, మూల పింఛనులో 1.5 శాతం ఉద్యోగుల ఆరోగ్య పథకానికి చెల్లించడాన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 79ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు సోమవారం జారీ చేశారు. నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు ఉద్యోగుల మూలవేతనంలో 1.5 శాతం చొప్పున మినహాయించడానికి సంబంధించిన మార్గదర్శకాలను ఇందులో పేర్కొన్నారు.

అందులో భాగంగా భార్య భర్తలలో.. ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినప్పుడు, ఒకరు రాష్ట్ర ప్రభుత్వ మరొకరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినప్పుడు, ఇద్దిరిలో ఒకరు పెన్షనర్, ఇంకొకరు ఉద్యోగిగా ఉన్నప్పుడు ...ఒక్కరికే ఈహెచ్‌ఎస్ కోసం మినహాయించాలని పేర్కొనడం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినప్పుడు.ఒకరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, మరొకరు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అయినప్పుడు. ఒక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ సర్వీస్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ రెండింటినీ పొందుతున్నప్పుడు.

పై సందర్భాల్లో సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవో) ఆధార పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారించాలి. అలాగే ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్‌ఎంఎస్ వ్యవస్థలో భార్య/భర్త ఉద్యోగం, పెన్షన్ వివరాలను నమోదు చేసి ఈహెచ్‌ఎస్ చందా రెండుసార్లు మినహాయించకుండా చూడాలి. ఇప్పటికే అదనంగా మినహాయించి ఉంటే, ఆ అదనపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఉత్తర్వులో స్పష్టం చేశారు.

# ఫ్రాన్స్‌తో పర్యాటక, సాంస్కృతిక బంధాల బలోపేతానికి కృషి

### తెలంగాణ పర్యాటక రంగాన్ని ఫ్రెంచ్ పర్యాటకులకు చేరువ చేద్దాం

### సాంస్కృతిక మార్పిడి ద్వారానే పర్యాటకం, పెట్టుబడులకు ఊతం

### మంత్రి జూపల్లిని కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్

### పర్యాటక, వారసత్వ రంగాల్లో సంయుక్త కార్యాచరణకు ప్రతిపాదన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరియో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫ్రాన్స్ మధ్య పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పెట్టుబడులు, ప్రజల మధ్య పరస్పర సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉందని, హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదుగుతూనే తన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షి ంచుకుంటోందని అన్నారు. తెలంగాణ పర్యాటక విశేషాలను ఫ్రాన్స్‌లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం, ఫ్రెంచ్ ఎంబసీ, పర్యాటక సంస్థలు భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, పరస్పర పర్యటనలను మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక సారూప్యతలు, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి అవకాశాలను గుర్తించేందుకు సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారానికి బాటలు పడతాయని తెలిపారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ మాట్లాడుతూ పర్యాటకం దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక రంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే దేశాల్లో ఫ్రాన్స్ ఒకటని, ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా అంతర్జాతీయ పర్యాటకులు ఫ్రాన్స్‌ను సందర్శిస్తున్నారని తెలిపారు. పర్యాటకం, సంస్కృతి రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయని చెప్పారు. భారత్-ఫ్రాన్స్ మధ్య రక్షణ, ఔషధ తయారీ, సాంకేతిక రంగాల్లో బలమైన భాగస్వామ్యం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో సుమారు 200 మంది ఫ్రెంచ్ పౌరులు నివసిస్తున్నారని తెలిపారు. తెలంగాణతో పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ రంగాల్లో మరింత సహకారానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యాటక ప్రాంతాలను ఫ్రెంచ్ పర్యాటకులకు మరింత చేరువ చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# పెరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

### రోజుకు అదనంగా రూ.10 కోట్లు రాక

### ఆర్థిక శాఖ అధికారుల సంతృప్తి

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువలను ఇటీవల పెంచిన నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. అయితే ఇదే సమయంలో రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్యలో మాత్రం స్వల్ప తగ్గుదల కనిపిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం నుంచి అమల్లోకి వచ్చిన మార్కెట్ విలువల సవరణ రాష్ట్ర వసూళ్లను గణనీయంగా పెంచింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్యలో స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ, పెరిగిన మార్కెట్ విలువలు రాబడిలో భారీ పెరుగుదలకు దారితీశాయి. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు ప్రతిరోజూ దాదాపు రూ.10 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతోంది. సవరించిన మార్కెట్ విలువలు రిజిస్ట్రేషన్ల వసూళ్లను గణనీయంగా పెంచాయని పేర్కొంటూ ఆర్థిక శాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు, ఇతర ప్రధాన నగరాలు, పట్టణాల చుట్టూ వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలలో ఖాళీ స్థలాలు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్‌ల రిజిస్ట్రేషన్ విలువలు పెరగడమే ఆదాయంలో ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. సవరించిన మార్కెట్ విలువలు అమల్లోకి రాకముందే ఆస్తి యజమానులు లావాదేవీలను నమోదు చేసుకోవడానికి ఎగబడటంతో, మే నెలలో ముందస్తు రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.1,700 కోట్లు సమకూరాయి. ధరల సవరణ తర్వాత రిజిస్ట్రేషన్లు నెమ్మదిస్తాయని అంచనాలు ఉన్నప్పటికీ, ఈ నెల మొత్తం ఈ ధోరణి బలంగా కొనసాగింది. ఈ నెల 25 వరకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ రూ.1,023.42 కోట్లు వసూలు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.920 కోట్లుగా ఉంది. ఈ నెలలో ఇంకా కొన్ని పనిదినాలు మిగిలి ఉండటంతో, మొత్తం రాబడి రూ. 1,100 కోట్లను సులభంగా దాటుతుందని, ఇది గత ఏడాది జూన్ కంటే దాదాపు రూ. 200 కోట్లు అధికమని అధికారులు అంచనా వేస్తున్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం 1న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూ ములు, భూదాన భూములులో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, పేదల ఇళ్ల స్థలాల కూల్చివేతను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తం గా దశలవారీగా ఆందోళనలు, పోరాటాలు చేయాలని నిర్ణయించడం జరి గిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేన సాంబశివరావు తెలి పారు. అందులో భాగంగా జులై 1న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యా లయం వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. జులై 6న ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సిగాచి పరిశ్రమ ఘటనలో మరణిం చిన బాధిత కుటుంబాలకు యాజమాన్యం వెంటనే పరిహారం చెల్లిం చాలని డిమాండ్ చేశారు. పాశ మైలారం సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించి 54 మంది మరణించిన ఘటన ఏడాది పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయి పరిహారం అందకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈఎస్ఐ, పీఎఫ్‌లకు అదనంగా కోటి రూపాయలు, ఘటనలో గాయపడిన వారికి తగిన పరిహారం, వైద్య ఖర్చులను యాజమాన్యం నుండి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# బియ్యం ఎగుమతులకు ప్రత్యేక విధానం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు సంస్థ ప్రతినిధులు

### ఫోర్టిఫైడ్ రైస్‌తో పోషకాహార భద్రతకు ఊతం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బియ్యం పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక బియ్యం ఎగుమతి విధానాన్ని రాష్ట్ర ప్రభు త్వం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుండగా, కేవలం 36 లక్షల మెట్రిక్ టన్నులే రాష్ట్రంలో వినియోగం అవుతున్నా యన్నారు. మిగిలిన బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఎగుమతి విధానాన్ని తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన అన్‌లాకింగ్ మార్కెట్ పొటెన్షియల్- అడ్వాన్సింగ్ ఫోర్టిఫైడ్ రైస్ ఇన్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా కేసిపి న్యూట్రి పోషణ ఫోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తులను ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రస్తుతం దేశంలోనే బియ్యం ఉత్పత్తి, సేకరణలో అగ్రస్థానంలో ఉందన్నారు. బియ్యం మిల్లర్లు దేశీయ మార్కెట్‌తో పాటు విదేశీ మార్కెట్లలోనూ విస్తరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. ఫిలిఫిన్స్ వంటి దేశాలకు ఇప్పటికే తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతి అవుతుందన్నారు. ప్రజలు ప్రతి రోజు తీసుకొనే ప్రధాన ఆహారమైన బియ్యం ద్వారానే పోషకాహార లోపాలను తగ్గించవచ్చున్నారు. ఆరోగం మాత్రల్లో కాదని, మన భోజన పాత్రలో ఉండాలన్నారు. టెక్నోసర్వ్ ఆధ్వర్యంలో మిల్లర్స్ ఫర్ న్యూట్రిషన్ సంస్థ, కేసిపి న్యూట్రిషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బియ్యం మిల్లర్లు, ఆహార పరిశ్రమ ప్రతినిదులు, పోషకాహార నిపుణులు తదితరులు పాల్గొన్నారు.



సోమాజీగూడలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విహెచ్

## ప్రభుత్వ సలహాదారు విహెచ్‌కు శస్త్ర చికిత్స

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకు సోమవారం శస్త్రచికిత్స జరిగింది. ఆయ నకు కిడ్నీలో స్టోన్ సమస్య ఉండడంతో సోమాజీగూడలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) ఆస్ప త్రిలో డాక్టర్ మల్లికార్జున్ వైద్యబృందం విహెచ్‌కు శస్త్రచికిత్స నిర్వ హించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య సమస్య నిలకడగా ఉందని వైద్యు లు పేర్కొన్నారు. విహెచ్ అనారోగ్య సమస్య తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఆస్పత్రికి రావడంతో సందడి నెలకొంది. కాగా, ఈనెల 25వ తేదీన సాయంత్రం విహెచ్‌కు కిడ్నీకి సంబంధించిన తీవ్ర అనారోగ్య సమస్య రావడంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే.

## ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

### ఆగస్టు 29 వరకు దరఖాస్తులకు అవకాశం: టాస్ డైరెక్టర్ లింగయ్య

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) అధ్వర్యంలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను టాస్ డైరక్టర్ కె లింగయ్య సోమవారం విడుదల చేశారు. ఓపెన్ స్కూల్స్‌లో టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవాలనుకునే వారు ఆగస్టు 29 వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫీజును ఆగస్టు 28 వరకు చెల్లించాలని సూచించారు. ఫీజును మీ సేవా, టీజీ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన పూర్తి సమచారాన్ని పొందుపర్చినట్టు టాస్ డైరక్టర్ లింగయ్య ప్రకటనలో తెలిపారు.

# యూరియాకు కత్తెర.. ఎకరానికి 2 బస్తాలే

### మండల యూనిట్‌గా బుకింగ్స్.. అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లు

### ఫెర్టిలైజర్ యాప్‌లో మార్పులు.. ఎరువుల పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన

### వ్యవసాయ శాఖ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువులను అందించేందుకు వ్యవసాయ శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో ఎదురైన ఇబ్బందులు, అక్రమాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగు సమయానికి ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసింది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో వ్యవసాయ శాఖ కీలక మార్పులు, అప్‌డేట్‌లను తీసుకొచ్చింది. వ్యవసాయ శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు గతంలో ఈ యాప్ ద్వారా ఎక్కడి వారైనా, ఏ ప్రాంతంలోనైనా యూరియా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో స్థానిక రైతులకు ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుత సీజన్ నుంచి మండల యూనిట్ విధానాన్ని అమలుల్లోకి తీసుకొచ్చారు. దీనివల్ల రైతులు కేవలం తమ సొంత మండల పరిధిలోనే యూరియా బుకింగ్ చేసుకోవడానికి వీలుంటుంది. ఫలితంగా స్థానిక రైతులకు సకాలంలో ఎరువుల కోటా దక్కనుంది. గతంలో కొందరు ఎరువుల డీలర్లు తమకు తెలిసిన వారికి ముందే సమాచారం అందించి ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు చూపిస్తూ నిల్వలను ఆఫ్‌లైన్ ద్వారా పక్కదారి పట్టించేవారనే ఆరోపణలు వచ్చాయి. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం యాప్‌లో అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లను జోడించింది. ఇకపై డీలర్లు తమ వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసినా, అది రైతులకు మరుసటి రోజు ఉదయం 7 గంటలకే స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే ఉదయం 7 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తే, అది మధ్యాహ్నం 3 గంటలకే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ నిబంధన వల్ల ఎరువుల నిల్వలపై పారదర్శకత పెరగనుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యాప్ ఓపెన్ చేసి తమకు కావలసిన యూరియాను సులభంగా బుక్ చేసుకోవచ్చు. అలాగే గతంలో పలువురు రైతులు, వ్యాపారులు యూరియా కొరత వస్తుందనే భయంతో పంటల నమోదు సమయంలో మొక్కజొన్న పంటను ఎంపిక చేసుకునేవారు. ఎందుకంటే మొక్కజొన్న సాగు చేసే రైతులకు ఎకరాకి 5 బస్తాల యూరియా అందించే వెసులుబాటు ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అవసరం లేకపోయినా ఎక్కువ బస్తాలను పొంది నిల్వ చేసుకునేవారు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులు ఏ పంట సాగు చేసినా సరే ఎకరానికి కేవలం 2 బస్తాలు మాత్రమే బుకింగ్ అవుతాయి. ఒక ఎకరం భూమి ఉన్న రైతుకు ఒకే విడతలో గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే బుకింగ్ చేసుకునేలా యాప్‌లో పరిమితి విధించారు. ఇక సాంకేతిక ఇబ్బందులను తొలగించడంలో భాగంగా ఐటీ విభాగాధికారులు ఈ ఫర్టిలైజర్ యాప్‌ను పూర్తిగా అప్‌డేట్ చేశారు. గతంలో యూరియా బుకింగ్ చేసే సమయంలో ప్రతిసారీ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు సకాలంలో రాక రైతులు బుకింగ్ చేసుకోలేకపోయేవారు.



సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

## ఇంజినీరింగ్ బి-కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలి

### ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ఎఐఎస్‌ఎఫ్ ధర్నా

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇంజనీరింగ్ బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల వ్యాపారాన్ని అరికట్టాలని, మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని, డిమాండ్ కోర్సుల సీట్లపై ఫీజుల దందాను అరికట్టాలని, యాజమాన్య కోటా పేరుతో లక్షల రూపాయల ఫీజుల దోపిడీ చేస్తున్న కళాశాలలపై ఎసిబి, ఐటి దాడులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడీ చేస్తున్నాయని, ఇంజినీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపారమయంగా మార్చారని విమర్శించారు.

# 4 రోజుల్లోనే 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలు ఇంటింటికి పంపిణీ




### నిర్ణీత గడువులోగా వందశాతం అందజేసేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 29:** రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న 'సర్' ప్రక్రియపై సోమవారం బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం నాలుగు రోజులలోనే దాదాపు 1.73 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడంపై బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల అధికారుల పనితీరు పట్ల సిఇఒ అభినందించారు. నిర్ణీత గడువులోగా 100శాతం ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసేందుకు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు బిఎల్‌ఓలను ప్రోత్సహించాలని సూచించారు.

బిఎల్‌ఓలు తమ విధులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్-ఎస్ఐఆర్)2026 కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏ) చురుకుగా పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఏఈఆర్‌లు, ఇఆర్‌ఓలు విస్తృతంగా క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహించి, బిఎల్‌ఓలకు అవసరమైన సూచనలు అందించి ప్రజలతో అనుసంధానం పెంచాలని, ఓటరు హెల్ప్‌లైన్ 1950, హెల్ప్‌డెస్క్ నంబర్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. డిఈఓలు,ఇఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలను సమీక్షి స్తూ, సామాజిక మాధ్యమాల్లో క్రమం తప్పకుండా వివరాలను ప్రచురించాలని, అధికారుల క్షేత్ర పర్యటనలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపడంలో ఓటర్లకు సహాయపడే ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేలా బిఎల్‌ఓలకు మరో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారులను ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసి)జి.ఎస్. చారి, అన్ని నోడల్ అధికారులు, పీఎం (ఐటీ), సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్త్రీ పురుషులు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

### టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, జూన్ 29 ప్రభాతవార్త

స్త్రీ,,పురుషులు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని సూరపు రాజు పల్లి పంచాయతీలో శ్రీ హనుమంత్ లక్ష్మణ సీత సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడులు ఏ విధంగా ఉన్నాయో, మంచి ఉన్నత భావాలతో భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలని అందుకు నిదర్శనమే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో చక్కటి వాతావరణం ఉన్న సందర్భంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఆయన అన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఎంతో కనుల పండుగగా జరగడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని గ్రామంలోని ప్రజలందరూ భక్తితో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరపరాజు సుబ్బరాజు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు శివ శంకర్ రాజు, పురుషోత్తం రాజు, కంద్రిక చందర్ రాజు, జయరామరాజు, మాజీ సర్పంచ్ పుష్పలత, విజయవర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సూరపురాజు సుబ్బరాజుచే ముక్కారూపానంద రెడ్డికి ఘన సన్మానం నిర్వహించారు.

## ఉచిత జాబ్ మేళాల ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు : ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రైల్వే కోడూరు, రూరల్ జూన్ 29(ప్రభాతవార్త)::

సమాజంలో ఉన్న నిరుద్యోగులు ఉచిత జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థాయికి చేరాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని సాయి నగర్ లో ఉన్న సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో ఉచిత జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఉన్న నిరుద్యోగులకు ఇటువంటి అవకాశాలు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో చక్కటి ఉన్నత భావాలతో ఉద్యోగాలు సాధించి సమాజంలో గుర్తింపు పడాలని ఆయన అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నారని ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరుద్యోగుల కోసం ప్రత్యేక ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఖాళీగా లేకుండా నిరుద్యోగులు చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇటువంటి అవకాశాలు కల్పిస్తున్న సాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఎంతో కృషి చేస్తున్నదని వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు, ముత్యాల కిషోర్, శ్రీ సాయి ఇన్స్టిట్యూషన్స్ మరియు రిటైర్డ్ డివి ఈవో నాగేంద్ర, ఎస్ ఎస్ డి సి, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

## విభేదాలు వద్దు : సభను విజయవంతం చేయడమే లక్ష్యం: కస్తూరి, కేకే.

రైల్వే కోడూరు అర్బన్, జూన్ 29, ప్రభాత వార్త.

రైల్వే కోడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడుకి కార్యకర్తలు అభిమానుల అభిమానం, కల ఏమాత్రం తగ్గలేదు. సోమవారం సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం కస్తూరికి కనువిప్పు కలిగించింది. నియోజకవర్గంలోని కార్యకర్తలు అందరూ భారీగా తరలివచ్చి ఆయన పిలుపుమేరకు సమావేశానికి హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా జులై రెండు రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లి పంచాయతీలోని మంగంపేట వద్ద ఏర్పాటు చేయనున్న విబిజి రాంజీ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర పంచాయతీ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ హాజరయ్యే బహిరంగ సభకు జన సమీకరణ కోసం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విశ్వనాథ నాయుడు అధ్యక్షతన చేసిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఖాది పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ విభేదాలు విడనాడి బహిరంగ సభను విజయవంతం చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకోవాలని కార్యకర్తలకు సూచించారు. అనుభవం లేని కొత్తవారికి పార్టీలో అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టే పథకాలను ఆయన హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర యంత్రాంగం జన సమీకరణ చేయాలని తన భుజస్కందాల మీద బాధ్యతను మోపిందన్నారు. అనంతరం ముఖ్య అతిథి కేకే చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి కేంద్ర మంత్రులు హాజరై వి బి జి రాంజీ పథకాన్ని ప్రారంభించే బహిరంగ సభను మన నియోజకవర్గంలో అత్యధిక జన సమీకరణతో విభేదాలు విడనాడి జన సమీకరణ చేసి కస్తూరి తోనే సభకు కల వచ్చిందనే పేరు తెచ్చి పెట్టాలని కోరారు. అనంతరం బహిరంగ సభాస్థలిని పరిశీలించేందుకు వచ్చిన తిరుపతి జిల్లా కలెక్టర్ ని మార్గమధ్యంలో కలిసి కేకే, కస్తూరి లో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, ఓబులవారిపల్లి మండల మాజీ ఉపాధ్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకుడు గునిపాటి చెన్నరాయుడు, గుండయ్య నాయుడు, మాజీ జెడ్పిటిసి సీనియర్ టిడిపి నాయకుడు నాయుడురి రమణ, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు బారిఎత్తున పాల్గొన్నారు.

## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణకి ఆహ్వానం

### - సౌత్ ఇండియా కురుబ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు





తిరుపతి హెల్త్, జూన్ 29, ప్రభాతవార్త

హైదరాబాదులో మాజీ గవర్నర్ బండా దత్తాత్రేయని రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్యని జులై 12న తిరుపతి నందు సౌత్ ఇండియా కురుబ కురుమ కురవం కురుబ ధనగర్ కాన్ఫరెన్స్ మీటింగ్‌కి ఆహ్వానించడం జరిగినదని సౌత్ ఇండియా కురబ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. దక్షిణ భారతదేశంలో కురుబ కురుమ ధనగర్ చైతన్యపరిచే విధంగా రాబోయే కాలంలో దక్షిణ భారతదేశంలో ఉన్న రెండు కోట్ల కురుబ కురుమ దంగల్ సమాజం మన వాటా మన రాజకీయ హక్కులు మన పిల్లలకి స్కాలర్షిప్, ఉన్నత చదువుల కోసం విదేశీ విద్య, లోన్లు, చిరు వ్యాపారాలు చేసేవారికి ప్రభుత్వం నుంచి దక్షిణ భారతదేశంలో ఉన్న ఆరు రాష్ట్రాల్లో మన ఐక్యత చాటుకుని మన విధి విధానాలు 12 వ తారీఖున నిర్ణయించి ప్రభుత్వాలకు మన మీటింగ్ నిర్ణయాల్ని విన్నవించడం జరుగుతుంది అన్నారు. వారుసానుకూలంగా స్పందించి తప్పకుండా ఈ కార్యక్రమానికి వస్తామని తెలియజేశారు.

## చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సేవలు ఆదర్శనీయం

### మన్నం ప్రేమ్ కుమార్



తిరుపతి విద్య, జూన్ 29 ప్రభాత వార్త

చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు మన్నం ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మన్నం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, చంద్రగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, వారి సంక్షేమాన్ని తన బాధ్యతగా భావించి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు ప్రజల పక్షాన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేసే పోరాటానికి వైఎస్సార్ విద్యార్థి విభాగం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యువత, విద్యార్థులు ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు వచ్చి సామాజిక బాధ్యతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ముని, నరేష్, పవన్, మధు, నవీన్, సుభాష్, సిద్ధు, శివ, లిఖిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ ఫోర్‌మన్ నూర్ బాషాకు ఆత్మీయ వీడ్కోలు



తిరుపతి విద్య జూన్ 29 ప్రభాత వార్త

ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఎస్. నూర్ బాషాకు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ప్రొఫెసర్ హేమ, ఆచార్యులు వెంకట రామయ్య, దివాకర్ రెడ్డి, ధర్మారెడ్డి, అరుణ పాల్గొని నూర్ బాషా విశ్వవిద్యాలయానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం, సహోద్యోగులతో సత్సంబంధాలు అందరికీ ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. టెక్నికల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గురు ప్రసాద్ మాట్లాడుతూ నూర్ బాషాతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహోద్యోగులు పద్మనాభం, మనోజ్ కుమార్ సింగ్, యోగేశ్వరి, నవీన్ కుమార్, మొహమ్మద్, టైమ్ స్కేల్, ఎన్ఎంఆర్ ఉద్యోగులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకుంటూ పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా నూర్ బాషాను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



వడమాలపేట, జూన్ 29 ప్రభాతవార్త:

వడమాలపేట మండలం ఎస్వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 30 వేల రూపాయలు విలువ గల విద్యాసామగ్రి, పాఠశాలకు బీరువాను వితరణగా అందజేశారు. ఎస్వీ పురం గ్రామానికి చెందిన యువశ్రీ, మురళీకృష్ణ, శ్రీనివాసవర్మ, వాసవి తమ తల్లిదండ్రులైన దొమ్మరాజు జయదేవరాజు, ధనలక్ష్మిల వర్ధంతి సందర్భంగా పాఠశాలలో 140 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని, బీరువాను అందజేశారు. దాత ఎస్వీ యూనివర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ యువశ్రీ మాట్లాడుతూపిల్లలందరూ చిన్నప్పటి నుంచి చక్కని క్రమశిక్షణతో మంచి విలువలతో విద్యను అభ్యసించి వారి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం నరేష్, ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు రంగయ్య, ఓంకార్, నరసింహారెడ్డి, సుదర్శన్, సూర్యప్రకాష్, శోభా మాలిని, దామోధర్, వేణుగోపాల్, అనురాధ, మల్లేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జూలై 3 నుంచి సిఎం చంద్రబాబు పర్యటన

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో జూలై 3-5 తేదీల్లో పర్యటించనున్నారు. జూలై 3వతేది కడపజిల్లాలో పర్యటన అనంతరం కుప్పంకు చేరుకుంటారు. 4న కుప్పంలో సుమారు వంద కోట్లకు పైబడి నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పలు పరిశ్రమలకు, స్థానిక ంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం చంద్రబాబు ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిసింది. అలాగే బహిరంగసభలో సైతం పాల్గొననున్నారు. పార్టీ శ్రేణులు, అధికారులతో సైతం సమావేశమవుతారని తెలుస్తోంది. 5వతేది మరలా కుప్పం నుంచి అమరావతికి తిరుగుప్రయాణం అవుతారు. కాగా సిఎం పర్యటన వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## రైతు బజార్ వద్ద అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాలి

### - గురువారం శాంతియుత నిరసన

### - రైతు బజార్ రైతులు,డ్వాక్రా సంఘాల సభ్యులు విజ్ఞప్తి




తిరుపతి హెల్త్, జూన్ 29, ప్రభాతవార్త

తిరుపతి రైతు బజార్ ప్రధాన ద్వారం ముందు అక్రమంగా అనుమతులు లేకుండా కూరగాయల బండ్లు, కూరగాయల వ్యాపారస్తులు రోడ్డుపైన పెట్టి అమ్ముతున్నారని దీనివల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, రైతు బజార్‌లో ప్రభుత్వానికి హద్దులు చెల్లిస్తూ చట్టబద్ధంగా వ్యాపారం చేస్తున్న రైతులు డ్వాక్రా సంఘాల సభ్యులకు నష్టం జరుగుతుందని సి. మాధవ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారు, వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని, యోగదారులు లోపలకి వచ్చి కూరగాయలు కొనకుండా బయట రోడ్లపైనే కొనుక్కుని వెళుతున్నారని, దీనివలన డ్వాక్రా సంఘాల సభ్యులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. దీనివలన రైతు బజార్లో వ్యాపారం రోజురోజుకీ పడిపోతుందని, కొందరు బయట అక్రమంగా వ్యాపారం చేస్తున్న వ్యక్తులు అధిక ధరలకు కూరగాయలు విక్రయించడం వినియోగదారులతో అనుచితంగా ప్రవర్తించడం ఇంటి విషయాల పైన ప్రజలకు జిపిఆర్ఎస్ ద్వారా అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇవి సమస్యలపై పలుమార్లు పోలీస్ వారికి, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు లిఖితపూర్వకంగా మరియు మౌఖికంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని పోయారు. బుధవారం లోపు రైతు బజార్ ముందు ఉన్న అక్రమ అనధికార కూరగాయల పండ్లను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో రెండవ తేదీ రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు కలిసి రైతు బజార్ ముందు రోడ్డుపైన శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వస్తుందని సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో ధర్మక్క, మునిరత్నం, రవి, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మహాలక్ష్మి యాగం

చిట్వేలి, జూన్ 29 ప్రభాతవార్త:





స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆల యం నందు నాల్గవ పౌర్ణమి పూజల్లో భాగంగా సోమ వారం శ్రీ మహాలక్ష్మి మ్ యా గంను ఆలయ పెద్దలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవారికి అర్చకులు మృత్యుంజయ ప్రత్యేక అలంకారం, అభిషేకాలు చేపట్టారు. తదుపరి కలశారాధన, శ్రీ మహాలక్ష్మి మ్ యాగం, పూర్ణహుతి, వేద విన్నపం తదితర కార్యక్రమాలను టీటీడీ అర్చకులు ఘనంగా చేపట్టారు. అనంతరం ప్రత్యేక అలంకారంలో శ్రీ భద్రకాళిని అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణను నిర్వహించారు. కార్యక్రమంలో బెంగళూరు వాస్తవ్యులు పద్మరాజు రామచంద్ర రాజు, ఆలయ చైర్మన్ సుబ్బరాయుడు, కమిటీ సభ్యులు యన్నారు కిషోర్ కుమార్, తిరుమల రెడ్డయ్య, పాత చిట్వేలి గ్రామ యువత మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మోహిని రూపంలో శ్రీ భూనీళా వెంకటేశుడు

చిట్వేలి, జూన్ 29, ప్రభాతవార్త:



స్థానిక మండల పరిధిలోని కంపసముద్రం అగ్రహారంలో వెలసిన శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో సందర్భంగా ఐదవ రోజైన సోమవారం ముగ్ధ మనోహర మోహిని రూపాన్ని ధరించి భక్తులను కటాక్షించారు. ఆలయ పెద్దలు స్థానిక గ్రామంతో పాటు, చిట్వేలి గ్రామ ప్రధాన వీధులలో స్వామి వారిని ఊరేగించారు. దారి పొడవునా భక్తులు పుష్ప, ఫల, నారీ కలాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి గరుడవాహన సేవ, మంగళవారం సాయంత్రం స్వామి వారి కళ్యాణం ఉత్సవం, పల్లకి ఉత్సవం, గజ వాహన సేవ, బుధవారం రథోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త చేట్లూరు శేఖర్ తెలియపరిచారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని వారు తెలియపరిచారు.

## సభను జయప్రదం చేయాలని గోడ పత్రాలు విడుదల

చిట్వేలి, జూన్ 29, ప్రభాతవార్త:

రైతు రక్షణ, వ్యవసాయరంగ పరిరక్షణ కోసం ఏలూరులో జూలై 3,4,5 తేదీలలో జరిగే రాష్ట్ర రైతు సంఘం 23వ మహా సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ. మణి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ఎం. గొల్లపల్లిలో అరటి, బొప్పాయి పంటపొలాల్లో మహాసభలకు సంబంధించిన గోడ పత్రాలను రైతులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ రైతులకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, పార్లమెంట్ లో చేసిన చట్టాలపై పోరాటానికి రైతాంగం సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కటారి. శంకరయ్య, జ్యోతి. నాగేష్, రైతులు నారాయణ, నరసింహులు, చంద్ర, సుధాకర్, ఓసూరయ్య, సుబ్బనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని యువతి మృతి



పుల్లంపేట, జూన్ 29 ప్రభాతవార్త :

మండల పరిధిలోని రెడ్డిపల్లి రైల్వే స్టేషన్ దగ్గరలో సోమవారం సాయంత్రం గుర్తుతెలియని యువతి రైలు పట్టాల పై పడి ఉన్నది రైలు నుంచి జారి పడిందా, లేక ఆత్మహత్య చేసుకుందా అనే వివరాలు తెలియాల్సి ఉంది ఈ విషయమై రైల్వే పోలీసులు దర్యాప్తును చేపట్టారు యువతి మృతి చెందిన స్థలంలో ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు చిన్న వయసులో యువతీ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది

## "శ్రీమాత ఆవాసం" సేవలు అభినందనీయం


### ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు

చంద్రగిరి, జూన్ 29 ప్రభాతవార్త:

గత 5 సంవత్సరాలుగా శ్రీమాత ఆవాసం కేంద్రంలో అనాధలు, వెనుబడిన బాలికల సంరక్షణకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు కొనియాడారు. మండల పరిధిలోని పిచ్చినాయుడు పల్లిలో సోమవారం శ్రీమాత బాలికల ఆవాస నూతన భవన నిర్మాణానికి చేపట్టిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణానికి స్థలం విరాళం ఇచ్చిన విరాళదాత డాక్టర్ నటరాజ ప్రసాద్‌కు సభికులందరి తరపున, ఆవాసం తరపున కృతజ్ఞతలు తెలిపారు. 5 ఏళ్ళ క్రితం తిరుపతిలో నలుగురు బాలికలతో ప్రారంభమై నేడు 30 మంది బాలికలతో నిర్వహించబడుతుండటం వారి కృషికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞట్రస్ట్ అధ్యక్షుడు మార్తాండ భాస్కర్‌రావు, క్రీడా భారతి కార్యదర్శి పాదిరి ధనంజయ రెడ్డి, బిజెపి నాయకుడు కోలా ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సన్మానం

తిరుపతి కలెక్టరేట్, జూన్ 29 ప్రభాతవార్త :



ఏపీఎస్ ఆర్టీసీలో 40 ఏళ్ల వివిధ హోదాల్లో పనిచేసిన కె. హరి నాథరెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని తిరుపతిలో ఓ కల్యాణ మండపంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కండక్టర్‌గా చేరి చిత్తూరు వన్ డిపోలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేశారు. మూడుసార్లు సీసీఎస్ డెలిగేట్‌గా కూడా గెలిచారు. హరనాథరెడ్డి దంపతులను ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు సన్మానించి ఆయన సేవలను ప్రస్తుతించారు. ఏపీపీటీడీ ఆఫీస్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. కొండారెడ్డి, జనరల్ సెక్రటరీ వి. శివప్రసాద్, నేతలు ఎస్వీ బాబు, ఈశ్వర్‌రెడ్డి, జేబీజీ రెడ్డి, పీవీ సుబ్బారావు, ఉమ్మడి జిల్లాలోని వివిధ డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు.

## వాటాదారులకు డివిడెంట్లు ఇవ్వండి

### - కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సభ్యురాలు వి గంగా

తిరుపతి హెల్త్, జూన్ 29, ప్రభాతవార్త




తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు నందు సుమారు 11 సంవత్సరాలుగా వాటాదారులకు డివిడెంట్లు ఇవ్వలేదని అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గంగ మాట్లాడుతూ 63 వేల మంది సభ్యులు ఉన్న బ్యాంకు లో వారు జమ చేసిన డబ్బులు, లోన్ల నుండి వచ్చే అమోంట్ ద్వారానే సిబ్బందికి జీతాలు వస్తాయన్నారు. బ్యాంకు నుండి షూరిటీ ద్వారా రుణం ఇస్తున్నారని, కానీ రుణం పొందిన వారి నుండి రికవరీ సక్రమంగా చేయకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. రికవరీ చేతకానప్పుడు లోన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. టౌన్ బ్యాంకు నందు ఐదు బ్రాంచ్ ల్లో సుమారు 100 కోట్లు యన్ బీపీ చూపిస్తున్నారని, లోన్లు కూడా వారి బంధువులు, ఫ్రెండ్స్‌కు ఇవ్వడం వారి నుండి రికవరీ చేయకపోవడం వల్ల కస్టమర్లకు డివిడెంట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నాలాగా చాలామంది కస్టమర్లు ఉన్నారని అన్నారు. 1988 నుంచి ఖాతాలు ఉన్నా వడ్డీ ఇంత వరకు ఇవ్వలేదని ఆరోపించారు. వాటాదారుల హక్కులు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్31(3) ప్రకారం ఏడు రోజులలోగా వాయిదా పడిన ఏజీఎంను నిర్వహించాలని, గత పది సంవత్సరాల డివిడెంట్ మరియు లాభాల వివరాలను సభ్యుల ముందు ఉంచాలని, మిస్లేనియస్ ఖర్చుల వివరాలు అందించాలని, భవిష్యత్తులో చెల్లుబాటు అయ్యే ఏజీఎం నిర్వహించేందుకు అవసరమైన కోరం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని టౌన్ బ్యాంకు బోర్డును కోరారు. ఈ విషయమై ఆంధ్ర ప్రదేశ్ సహకార సంఘాల రిజిస్టర్‌కి, బ్యాంకు న్యాయవాదికి, తిరుపతి జిల్లా కలెక్టర్‌కి, భారతీయ రిజర్వ్ బ్యాంకు వారికి, కంప్లైంట్ చేశానన్నారు. ఈ సమావేశంలో పద్మనాభ రెడ్డి, యమ్ ఎస్ నాదముని, జె కే రాయల్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## ట్రాఫిక్ చిత్తడిలో శ్రీకాళహస్తి పట్టణం!

-కొత్త సిఐగా బాధ్యతల స్వీకరణ
-పట్టణ ట్రాఫిక్‌పై దృష్టి సారించాలి
-ప్రకటనకే పరిమితమైన ట్రాఫిక్ పోలీసుస్టేషన్



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త: పట్టణం గత కొన్ని రోజులుగా ట్రాఫిక్ వలయంలో చిక్కుకొని, విలవిలాడుతుంది. పట్టణవాసులు, ఆలయానికి విచ్చేస్తున్న భక్తుల అవస్థలు వర్ణాతీతంగా మారాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐగా వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ వాసిగా వెంకటేష్‌కు స్థానిక సమాచారం బాగా తెలుసు అంతేకాకుండా శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐగా పని చేసిన ఆయన పదోన్నతి లభించింది. స్థానికంగానే సిఐగా పని చేసే అవకాశం లభించింది. అయితే శ్రీకాళహస్తి పట్టణాన్ని గత కొంత కాలంగా ట్రాఫిక్ చిత్తడి కుదిపేస్తుంది. గతంలో రెండు పోలీసు స్టేషన్లు ఉన్నపుడు పట్టణంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సాగేది, కానీ గత కొంత కాలంగా ట్రాఫిక్ సమస్య జటిలమైంది. శ్రీకాళహస్తిలోని కొన్ని రోడ్లు ఇరుకైనవే కానీ ఇక్కడ ప్రణాళికా బద్ధంగా పని చేస్తే సమస్యకుపరిష్కారం ఉంటుంది.కానీ ఆ దిశగా గత కొంత కాలంగా పోలీసుల చర్యల్లేవు.ముఖ్యంగా పట్టణంలోని జయరామరావు వీధిలో నిత్యం గంటల కొద్ది ట్రాఫిక్ చిత్తడి. అలాగే దిగువ సన్నిధివీధిలో ఎం జరుగుతుందో తెలియని స్థితి. కారణం అందరికి తెలిసిందే.శ్రీకాళహస్తిలో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేస్తున్నారు.కానీ ఆచరణలో ప్రణాళిక రూపకల్పనలో కొంత అవగాహనా రాహిత్యం అనే చెప్పాలి.

**పర్యవేక్షణ లేకనే...**

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం పర్యవేక్షణ లేకనే.శ్రీకాళహస్తిలో వన్‌సైడ్ పార్కింగ్‌ను అమలు చేస్తున్నారు.అయితే ఇరుకురోడ్ల మీద వ్యతిరేక దిశలో ఆటోలు నడవటం వల్ల ప్రధాన సమస్యగా మారింది.ఇక జయరామారావు వీధిలో సమస్యకు కారణం బేరివారి మండపం వద్ద పోలీసు కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ అక్కడ నుంచి ఎదురుగా వాహనాలు,ముఖ్యంగా ఆటోలు ప్రవేశించకుండా ఆపగల్గితే ఇక్కడ ట్రాఫిక్ ఉండదు.కానీ ఎందుకో గత కొంత కాలం నుంచి ఈ అంశం పట్టించుకోవటం లేదు. అంతేకాకుండా రిపబ్లిక్ క్లబ్ నుంచి పెద్దమసీదు వీధిలో ట్రాఫిక్‌ను మళ్ళిస్తున్నారు. ఇది అసలే ఇరుకు వీధులు ఈ వీధిలో బిరియాని సెంటర్లు, పద్మావతి టిఫిన్ సెంటర్ వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో ముందుకు సాగలేని పరిస్తితి. దాటితే జయ రామారావువీధిలోకి వెళ్ళాలంటే చిన్న మలుపు. ఈ రెండు సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలి. ముఖ్యంగా బేరివారి మండపం వద్ద కానిస్టేబుల్‌ను నియమించి ఎదురుగా వాహనాలను అపగల్గితే సగం సమస్య పరిష్కారమౌతుంది. ఇక సన్నిధివీధి సమస్యను పరిశీలిస్తే గతంలో బిక్షాల గాలిగోపురం వద్ద కానిస్టేబుల్ పర్యవేక్షించే వారు. అయితే ప్రస్తుతం లేకపోవడంతో, నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్‌టిసి బస్సులు బిక్షాల గాలిగోపురం నుంచి రాజగోపురం సన్నిధివీధిలోకి ప్రవేశించటం వల్ల జలవినాయక ఆలయం వద్ద మలుపు తిరగలేక భక్తుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది,ఇక నెహ్రూవీధిలోనూ, సినిమావీధిలో షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్‌కు అవకాశం లేదు. ద్విచక్రవాహనాలు రోడ్లు మీదనే పార్కింగ్ చేయటం వల్ల రాకపోకలకు అంతరాయం కల్గుతుంది. ఈ సమస్యలను అధిగమిస్తే పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు.

### మా స్థలానికి...లొల్లి ఎందుకు?

తొట్టంబేడు,జూన్ 29 ప్రభాతవార్త: అన్ని రికార్డులతో ఉన్న తన స్థలానికి సంబంధించి కొందరు యువకులు లొల్లిచేస్తూ తమను ఇబ్బంది పెడుతున్నారని సంబంధిత యజమాని పెరుమాళ్‌రెడ్డి సోమవారం వివరణ ఇచ్చారు. తొట్టంబేడు పంచాయతీలోని సర్వే నెంబర్ 297,298, 319లకు సంబంధించి కబ్జా అంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు. ఈ సర్వే నెంబర్లకు సంబంధించి అన్ని రికార్డులు తన వద్ద ఉన్నాయని వివరించారు. తన సొంత భూమిలో మట్టి తొలి చెట్లు నాటే కార్యక్రమాలను చేపట్టానన్నారు. మండలానికి చెందిన కొందరు తమ విషయంలో, అనవసరంగా వివాదాలు సృష్టిస్తున్నారని, వారిపై తాను కేసు కూడా నమోదు చేయించినట్లు పెరుమాళ్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

### పోతులూరి ఆలయంలో అన్నదానం



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం పేదలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చింది. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామీ ఆరాధన నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాల్లో కమిటి సభ్యులు మోహన్ ఆచార్యులు, చంద్రాచార్యులు, వెంకటేష్, రమేష్, గురవయ్య, జానకిరామ్, గోపి,రాజా, రమణయ్య,రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### నిర్మాణ సారధుల సమాచార సేకరణ



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త: తిరుపతి పార్లమెంటు పరిధిలో జనసేన పార్టీని బలోపేతం చేయటానికి అధిష్టానం ఆదేశాలతో పార్టీని ఆది నుంచి కాపాడుకుంటూ వచ్చిన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి లో కుప్పాల వెంకటేశ్ పర్యవేక్షణలో సమాచార సేకరణ శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి జూలై 3వరకు నిర్మాణ సారధులు సమాచార సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాలను ముక్కు మరియు ముక్కు ఫంక్షన్ హాల్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని వివరించారు. నిర్ణీత సమయం లోపల దరఖాస్తుల్ని పార్టీకి సమర్పించుకోవాలని సూచించారు.పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన ప్రతి ఒక్కరు. దరఖాస్తులు సమర్పించుకొని పార్టీ నుంచి గుర్తింపు పొందాలని కోరారు.

### ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడి



బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 29 ప్రభాతవార్త: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి లోకేష్ డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా అధికంగా ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బంది కల్గిస్తున్నారని వివరించారు. మండలంలో కొన్ని పాఠశాలలకు కావాల్సిన అనుమతులే లేదు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ అంశాలపై విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకొని ప్రైవేటు పాఠశాలల దోపిడి నుంచి తల్లిదండ్రులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హెచ్. లోకేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పివి ప్రసాద్ పాల్గొన్నారు.

### స్వచ్ఛ రథంకు చెత్తతో...ఇంటి వినియోగానికి సరకులు



బుచ్చినాయుడు కండ్రిగ, జూన్ 29 ప్రభాతవార్త: స్వచ్ఛ రథంకు తడిపొడి చెత్తలను అందించి, ఇంటి అవసరాలకు కావాల్సిన నిత్యావసర సరకులను పొందాలని కార్యదర్శి ఇందిరమ్మ అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా తడిపొడి చెత్తలనువేరు చేసి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొడిచెత్తను స్వచ్ఛ రథానికి అందిస్తే ఇంటికి అవసరమయ్యే సరుకులను పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆమె మాట్లాడుతూ నీర్పాకోట పంచాయతీల సోమవారం స్వచ్ఛరథం వాహనం రావటం గ్రామంలోని ఇళ్ళ యజమానులు పనికిరాని ప్లాస్టిక్ వస్తువుల్ని, ఇనుప వస్తువుల్ని,బాటిల్స్, చిరిగిన పుస్తకాలు అట్టలు వస్తువులు స్వచ్ఛ రథానికి అందించి ఇంటికి కావాల్సిన నిత్యావసర సరకులను తీసుకున్నారు.

### పార్టీ కార్యదర్శిని కలిసిన వినూత



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ జనసేన ఇన్‌చార్జి వినూత కోట, ఆమె భర్త చంద్రబాబునాయుడు సోమవారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తాళ్ళూరిని కలిసి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా వినూత కోట శ్రీకాళహస్తిలో తమ డ్రైవర్‌కు సంబంధించిన హత్య కేసులో పథకం ప్రకారం తమను ఇరికించి పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని వివరించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని శ్రీరామ్‌కు వివరించారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తిలో జరిగిన సంఘటనలు, పూర్వాపరాలను అందించి సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

### నిరంతర కృషితోనే ఉత్తమ ఫలితాలసాధన

**- పుత్తూరు డీవైఈవో మహేశ్వరరావు**



పుత్తూరు రూరల్, జూన్ 29 ప్రభాతవార్త: పదో తరగతి విద్యార్థులు నిరంతరం కృషి చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించడానికి మార్గం సుగమం అవుతుందని పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు సూచించారు. సోమవారం పుత్తూరు మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. గత సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సాధించిన మార్కుల కంటే ఈ సంవత్సరం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇప్పటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందుకు వెళ్లాలంటే పోటీ పడి చదవాలని, ఎప్పటికప్పుడు వారికి కలిగిన సందేహాలను ఉపాధ్యాయులనుంచి నివృత్తి చేసుకుంటూ అవగాహనతో చదువు కొనసాగించాలని కోరారు. పరీక్షలను సరళంగా రాయడానికి వీలుగా ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత అయిన వారికి ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ లాంటి కోర్సులల్లో ప్రవేశానికి అవకాశం ఉంటుందని, ఆ రకంగా విద్యార్థులు ప్రయత్నం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల పర్యవసానాలు - నిర్మూలనపై సదస్సు

తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త:మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కాలేజీలో "మాదక ద్రవ్యాలు: వ్యసనాలు - వాటి నిర్మూలన" అనే అంశంపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ టీ. చైతన్య నిర్వహించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర సామాజిక సమస్య అని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం డాక్టర్ ఎం. ఇంద్రాణి, వి. ప్రీతి, ప్రాజెక్ట్ అసిస్టెంట్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా కుంబాభిషేకం



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ద్వీతీయ ద్వాదశవర్ష మహాకుంబాభిషేకం కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఆలయంలో వాస్తుబలి పూజలు సంప్రదాయ బద్దంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో జూలుగంటి సత్యనారాయణశెట్టి, జూలుగంటి చంద్రశేఖర్‌శెట్టిల పర్యవేక్షణలో పతాకా విష్కరణ జరిపారు. సాయంత్రం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘ సభ్యులతో 102 కలశాలతో పట్టణంలో జై వాసవి మాతా అంటూ నినాదాలు చేస్తూ సామూహిక గంగ పూజ, నాలుగుమాడా వీధుల్లో ఊరేగింపు జరిపారు. మహిళలు పసుపు రంగు చీరలు ధరించి చేతిలో దీపాలను వెలిగించుకొని ఊరేగింపు జరిపారు. సంఘాధ్యక్షుడు జూలుగంటి మురళి పర్యవేక్షణలో గ్రామోత్సవం నిర్వహించారు.

### వడ్డీ పన్నులు చెల్లించుటకు నేడు ఆఖరి రోజు



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త: 2026-2027 సంవత్సరమునకు చెల్లించవలసిన ఇంటి పన్నులు, ఖాళీజాగా పన్నులను చెల్లించుటకు జూన్ 30 ఆఖరి అని మున్సిపల్ కమిషనర్ ఎం.వి.క్రిష్ణారెడ్డి అన్నారు. పురప్రజలు చెల్లించిన పన్నులతోనే పట్టణాభివృద్ధి సాధ్యమౌతుందని తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులను చెల్లించాలని తెలియజేశారు. 2026-27 సంతవ్సరమునకు చెల్లించాల్సిన పన్నులకు సంబంధించిన డిమాండ్ బిల్లులు ఇప్పటికే సచివాలయముల నందలి అందజేయడం జరిగిందని, జూలై 1 నుండి విధించే అపరాధ రుసుము నుండి మినహాయింపు పొందవలసినదిగా తెలియజేశారు. అదే విధంగా కొళాయి పన్నులను కూడా త్వరితగతిన చెల్లించాలని తెలిపారు. వీధిదీపాలు, రోడ్డు మరమ్మతులు, కాలువ పనులు పన్నుల చెల్లింపుతోనే సాధ్యమౌతుందన్నారు.

### తంగేళ్ళపాళెం సహకార కార్యాలయంలో వారోత్సవాలు



తొట్టంబేడు,జూన్ 29 ప్రభాతవార్త: మండలంలోని తంగేళ్లపాళెం సహకార సంఘం కార్యాలయం పరిధిలో సోమవారం సహకార వారోత్సవాలను అధ్యక్షులు బీమాల భాస్కర్ ముదిరాజ్ సారధ్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమాలను సిఇఒ పి.చిరంజీవిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం హాజరు కాగా పచ్చదనాన్ని పరచే విధంగా ఆవరణంతా పచ్చని చెట్లను నాటారు. భాస్కర్ ముదిరాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు భరోసా కల్పించుటకు వారికి అందించే వెసులుబాట్లను అందించుటకు సహకార సంఘాలకుపూర్తి స్వేచ్ఛ ఇచ్చారన్నారు. ఈ ఏడాది ంరైతులకు పూర్తి సహకారం అందించుటకు ఆన్‌లైన్ ద్వారా ఎరువులు, పాస్పేట్ యూరియాలను అందించినట్లు తెలిపారు. సహకార రంగాన్ని బలోపేతం చేయటమే కాకుండా ప్రభుత్వం పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయటం లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు.

### పౌర్ణమి అన్నదానం



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో సోమవారం పౌర్ణమి సందర్భంగా సామాజిక సేవే బాధ్యతగా పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. పట్టణంలోని తేరువీధిలో వెలసిన కైలాస్ గ్రాండ్ సారధ్యంలో సోమవారం వేలాది మంది భక్తులకు అన్నదానం జరిపారు. ట్రస్టు ఆలోచనలకు అనుగుణంగా ప్రతి పౌర్ణమి నాడు ఇక్కడ నిరుపేదల భక్తులకు అన్నదానం అందిస్తున్నారు.అలాగే మహాశివరాత్రి లో ఐదు రోజుల పాటు మూడు పూటలా శివభక్తులకు భోజన వసతులు కల్పిస్తున్నారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాలను కైలాష్ గ్రాండ్‌కు సంబంధించిన రామకృష్ణారెడ్డి సారధ్యంలో అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాలను రామకృష్ణమనాయుడు,రఫీ,చెంచయ్య, మధు తదితరులు సహకరించారు.

### కుంబాభిషేకంలో కాంగ్రెస్ నాయకులు



శ్రీకాళహస్తి రూరల్,జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రాముల వారి మందిరం కుంబాభిషేకం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. మూడు రోజులుగా ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలపా దామోదరంరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయనతో పాటు తిరుపతిజిల్లా మైనారిటి సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్రరెడ్డి, యువజన అధ్యక్షులు యానాది నవీన్ కుమార్, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోని, శశి, సురేష్,మహేష్, లక్ష్మయ్య, మాస్, అరుణ్‌లు హాజరయ్యారు.

### అప్రజాస్వామిక విధానాలపై తిరుగుబాటు

**-వైకాపాకు మాజీ కౌన్సిలర్ రాజీనామా**



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి 28వ వార్డు వైకాపా కు చెందిన మాజీ కౌన్సిలర్ జయదేవన్‌గిరి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ విధానాలునాయకుల తీరును నిశితంగా విమర్శించారు. పార్టీకి రాజీనామా చేయటమే కాకుండా సభ్యత్వంకు స్వస్తి చెప్పినట్లు మీడియాకు వివరించారు. వైకాపా అధిష్టానం అనుసరిస్తున్న రాష్ట్ర ప్రయోజన వ్యతిరేక,హింసాత్మక రాజకీయ విధానాలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను 2014-19లో కౌన్సిలర్‌గా గెలిచి విలువలతో కూడిన రాజకీయాల కోసం వైకాపాలో చేరినట్లు వివరించారు. ఇకస్థానిక మాజీ ఎంఎల్‌ఏ వైకాపా ఇన్‌చార్జి మధుసూధనరెడ్డి వైఖరి నిరంకుశంగా మారిందని ఘాటుగా విమర్శించారు. క్షేత్రస్థాయిలోపార్టీ కోసం పాటుపడిన పాత తరం సీనియర్ నాయకులకు కనీస గౌరవం ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇటువంటి ఫ్యాక్షనిజం భావజాలాన్ని దేవాలయ అపవిత్రతను ప్రోత్సహించే పార్టీలో కొనసాగలేనని వివరించారు.ఇక పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇటీవల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ 2029లో తాము గెలిచి అధికారంలోకి వచ్చిన తరువాత తప్పు చేసిన అధికారులు ఏడు సముద్రాల అవతల ఉన్నా సరే లాక్కొస్తాం అని బహిరంగంగా బెదిరింపులకు దిగటం చట్టాన్ని వ్యవస్థల్ని భయభ్రాంతుల్ని చేయటమే అన్నారు.కాబట్టి తాను పార్టీకి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.

### మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు వగాహన




ఏర్పేడు,జూన్ 29 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని అంజిమేడులో వెలసి ఈశ్వరరెడ్డి న్యాయ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్యూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపుపోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నిత్యాదేవి సారధ్యంలో నిర్వహించిన పోటీలు 'మాదక ద్రవ్యాలు మరియు గంజాయి ముప్పు' అనే అంశంపై నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం,సమాజం నుంచి ముప్పును నిర్మూలించేందుకుఅవసరమైన చట్టపరమైన,సామాజిక చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై సమగ్ర ఆవగాహన పెంపొందించి సామాజిక బాధ్యతను పెంపొందించి, సామాజిక బాధ్యతను పెంపొందించటమే లక్ష్యమని మేనేజ్‌మెంట్ తెలిపింది. పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నిత్యాదేవి, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పదవ తరగతి కీలక దశ



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 29 ప్రభాతవార్త: విద్యార్థులకు పదవ తరగతి కీలకదశ అని బబొజ్జల బృందమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఊరందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనందరెడ్డి ఏర్పాటు చేసిన విద్యా సామగ్రి పంపిణి కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి అనేది కీలక దశ అన్నారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రాణించుటకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు క్రీడా యూనిట్లు,పాఠశాల మరమ్మత్తులకు నిధులు ఇప్పిస్తామని బృందమ్మ హామీ ఇచ్చారని, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆనంద్‌రెడ్డి ధాతృత్వం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మూడున్నర దశాబ్దాల పోలీసు సేవలకు గౌరవ వందనం

**సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో భావోద్వేగ వీడ్కోలు సభ**




సత్యవేడు, జూన్ 29 ప్రభాతవార్త: కాలంతో పాటు తరాలు మారినా, విధి పట్ల నిబద్ధత, క్రమశిక్షణ నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కొందరు అధికారులు మాత్రం తమ సేవలతో చిరస్థాయిగా గుర్తిండిపోతారు. అలాంటి అరుదైన అధికారుల్లో మహిళా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.అన్నపూర్ణ ఒకరు. పోలీసు శాఖలో సుమారు 36 సంవత్సరాల పాటు ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు, ఒత్తిళ్ళను చిరునవ్వుతో ఎదుర్కొంటూ ప్రజా భద్రతను తన ధ్యేయంగా భావించి సేవలందించిన ఆమె సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున నాయుడు, నాగలాపురం ఎస్ఐ సునీల్, సత్యవేడు ఎస్ఐ-2 లావణ్య, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### గజేంద్ర సామాజిక సేవ చిరస్మరణీయం : ఎమ్మెల్యే



కేవీబీ పురం, జూన్ 29 ప్రభాతవార్త: మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వి.గజేంద్ర పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని కేవీబీపురం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో పదవీ విరమణ సన్మాన సభ ఎంఈవోలు ఏర్పాటు చేశారు. ఈ సన్మాన సభకు ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని, ఆయనకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎన్నో సేవలు అందించారని పేర్కొన్నారు. మండల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గజేంద్ర, కుటుంబ సభ్యులను పూలమాలతో, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ చైర్మన్, అంజూరు తారక శ్రీనివాసులు, మండల ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, కలత్తూరు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కోళ్ళ విజయకుమార్, మునివేలు, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు పరిసర మండలాల ఎంఈవోలు యుగంధర్‌రాజు, ఓబయ్య, ఉపాధ్యాయ సంఘాలు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు రామానుంజన్ నాయుడు, పార్టీ జిల్లా రైతు సంఘం నాయకుడు గోపినాథ్‌రెడ్డి, మనీ, బాలాజీ, అవసరం సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెరణి ధనంజయులరెడ్డి, డాక్టర్ పెనుబాల చంద్రశేఖర్, మోహన్‌నాయుడు, బీజేపీ, జనసేన పార్టీల మండల నాయకులు, పలువురు పాస్టర్లు, ఉపాధ్యాయులు వై.ధర్మరాజురెడ్డి, సూపర్ ధర్మరాజులరెడ్డి, కేజీబీవీఎస్ లీడ్ స్కూలు హెడ్ కోనేటి సురేష్, వెంకట కృష్ణయ్య, హేమాద్రి, ఎమ్మార్సీ బృందం పాల్గొన్నారు.

### శ్మశానానికి దారి సౌకర్యం కల్పించండి: ఆర్‌డిఓకు వినతి



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని కమ్మకొత్తూరు గ్రామానికి సంబంధించిన శ్మశానానికి దారి సదుపాయం కల్పించాలని సోమవారం ప్రజా వేదిక సందర్భంగా ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వినతి పత్రం అందించారు. గ్రామస్తులకుమద్దతుగా సిపిఎం పార్టీ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ కమ్మకొత్తూరు గ్రామం సుమారు 150 సంవత్సరాలకు పూర్వం నుంచి ఉందన్నారు.అయితే ఇప్పటి వరకు శ్మశానం స్థలం కానీ దారి కానీ లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ గ్రామంలో సుమారు 200 కుటుంబాలు న్నాయి. ఈ కుటుంబాల వారు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు కష్టాలు తప్పటం లేదన్నారు. ప్రభు త్వం స్పందించి ఎస్సి సబ్‌ప్లాన్‌నిధులను సమీకరించి స్థలంతో పాటు అత్యాధునిక సదుపాయాలతో శ్మశానం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమాల్లో పార్టీకి చెందిన అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, బాలగురవయ్య, కృష్ణయ్య, టి.గురవయ్య, గున్నయ్య, శివప్రసాద్ హరేరామయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

30CTR 3:30CTR 3.qxd 6/29/2026 11:43 PM Page 1



# పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, జూన్ 29 ప్రభాత వార్త

జనసేన పార్టీలో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకే పార్టీ పదవులు దక్కేలా పారదర్శక విధానంలో సమాచార సేకరణ చేపడుతున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ జిల్లా సమావేశం సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ముక్కు అండ్ ముక్కు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ నిర్మాణాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమాచార సేకరణ కమిటీని ఏర్పాటు చేశారని చెప్పారు.మెంబర్ టు లీడర్‌షిప్ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవులను అర్హులైన కార్యకర్తలకు అందించడమే కమిటీ లక్ష యమన్నారు. కొత్తతరం నాయకత్వాన్ని ప్రోత్సహించి ప్రజలకు బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని అందించాలన్నదే పవన్ కళ్యాణ్ సంకల్పమని పేర్కొన్నారు. నాయకత్వం అనేది పదవి కాదని, సేవాభావం, ప్రజా పోరాటాలతో సంపాదించుకునే గౌరవమని కార్యకర్తలు గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు తాము ఆశిస్తున్న పదవులకు సంబంధించిన దరఖాస్తులను కమిటీ సభ్యులకు అందజేసి సహకరించాలని కోరారు.సమావేశంలో విజయనగరం జిల్లా జనసేన మాజీ అధ్యక్షుడు లోకం ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ పదవులపై ఆసక్తి ఉన్నవారు స్వయంగా కమిటీ ఎదుట హాజరై దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కమిటీ పూర్తిగా నిష్పక్షపాతంగా దరఖాస్తులను స్వీకరించి వెంటనే ఆన్‌లైన్ ద్వారా పార్టీ అధిష్ఠానానికి పంపుతుందని తెలిపారు. కమిటీ ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి, సభ్యుడు రాఘవయ్య, సమాచార సేకరణ కమిటీ సభ్యులు, పీఓసీలు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల పక్కనే మట్టి క్వారీలు...!

## చెన్నేరిలో గ్రామస్తుల నిరసన



సత్యవేడు, జూన్ 29 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెన్నేరి గ్రామంలో నివాస గృహాలకు అతి సమీపంలో, గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన జగనన్న ఇంటి పట్టాల పక్కనే కంకర క్వారీల పేరిట ఎర్రమట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కంకర క్వారీలకు సంబంధించిన లారీలను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. తమ ఇళ్ళకు, ఇంటి పట్టాలకు ఎలాంటి నష్టం కలగకుండా క్వారీలను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామస్తుల నిరసనతో స్పందించిన నిర్వాహకులు, కంకర తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చివేసి సరి చేస్తున్నట్లు సమాచారం. అయితే క్వారీ అనుమతులు ఒకరి పేరుపై ఉండగా తవ్వకాలు, నిర్వహణ మరొకరు చేస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అలాగే సత్యవేడు మండలంలో ఒక ప్రాంతానికి అనుమతులు తీసుకుని, మరో ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు క్వారీల నిర్వహణపై తగిన పర్యవేక్షణ చేపట్టడం లేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# న్యాయవాదుల నిరసన



సత్యవేడు, జూన్ 29 ప్రభాతవార్త:

సత్యవేడు కోర్టు న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరికి చెందిన చంద్రశేఖర్ అనే న్యాయవాదిపై తప్పుడు కేసులు బనాయించారని వారు ఆరోపించారు. రెండు వర్గాలు ఘర్షణ పడుతుండగా వారిని వారించడం జరిగిందని, అదే పెద్ద నేరంగా భావించి పిచ్చాటూరు పోలీసులు కేసు నమోదు చేయడం, ఏకంగా అత్యాయత్నం కేసు పెట్టడం న్యాయ సమ్మతంగా లేదన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి లొంగి కేసు నమోదు చేయడం జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజు, జానయ్య, మధు, మునిశేఖర్, శ్రవణ్, శ్రీరాములు, అజిత్, శివానంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వేలో మాజీ ఎంపీపీ



విజయపురం, జూన్ 29 ప్రభాతవార్త:

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బీఎల్‌వోలతో పాటు బీఎల్ఏలు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని ఆలపాకం గ్రామంలో మాజీ ఎంపీపీ శివలింగం, మాజీ సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు రవిచంద్ర రెడ్డిలు, బీఎల్‌వో, బీఎల్ఏలతో కలసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి 2002 ఓటర్ల జాబితాలో పేర్లు కలిగిన పారాలను అర్హులైన వారికి అందించి వాటిలో ఏ విధంగా సమాచారాన్ని పూరించాలని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఎన్నికల అధికారులకు సహకరించి తమ పేర్లను ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న ప్రయాణికుడు



రేణిగుంట, జూన్ 29 ప్రభాతవార్త

రేణిగుంట రైల్వే స్టేషన్ రెండో నెంబర్ ప్లాట్ఫారంపై ఒక ప్రయాణికుడు సోమవారం ఉదయం రైలు కింద శరీరాన్ని పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్సై మధు తెలిపిన వివరాలు ఇలా రేణిగుంట రైల్వే రెండో నెంబర్ ప్లాట్ఫారంపై సుమారు 35 సంవత్సరాల యువకుడు నెల్లూరు వెళుతున్న ప్యాసింజర్ రైలు కింద శరీరాన్ని పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని వద్ద భువనేశ్వర్ నుండి బెంగళూరుకు వెళ్లే జనరల్ టికెట్ లభించింది. మృతుడు తెలుపు చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అంతకుమించి మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. ట్రైన్ లోకో పైలట్ ఫిర్యాదు మేరకు ఆత్మహత్యగా రైల్వే పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి 32వ వార్డు ప్రజల సమస్యలపై కమిషనర్‌కు వినతి



తిరుపతి కార్పొరేషన్, జూన్ 29 ప్రభాతవార్త:

నగరంలోని 32వ వార్డులోని కోటకొమ్మల వీధిలో గంజాయి ముఠాల ఆగడాలు పెరగడం, ప్రజల్లో భయాందోళనలు నెలకొనడం, అలాగే పాతబడిన వీధి విద్యుత్ దీపాల వల్ల రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, 32వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పసుపులేటి సురేష్ వార్డు నాయకులతో కలిసి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే నూతన వీధి దీపాలు ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదం హరి, దశరథ, బాబు, సునీతా, పునీత, చరణ్ రెడ్డి, శశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 28 వినతులు

## కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి




తిరుపతి కార్పొరేషన్, జూన్ 29 ప్రభాతవార్త:

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదాదేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 22 మంది వినతులు సమర్పించగా, ఆరు మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. మునిరెడ్డి నగర్ లోని మా ఇంటి పక్కన వారు ఎటువంటి నెట్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు ఇబ్బందిగా ఉంది, నీటి పన్ను ఎక్కువగా వస్తోంది పరిష్కరించాలని, శివజ్యోతినగర్ లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని, సుబ్బారెడ్డి నగర్, శివజ్యోతి నగర్ లో త్రాగునీరు, మురుగునీరు కలసి పోతున్నాయి పరిష్కరించాలని, డ్రైనేజి కాలువలు శుభ్రం చేయాలని, ఈట్ స్ట్రీట్ నందు అక్రమంగా మాంసాహారం విక్రాయిస్తున్నారు పరిష్కరించాలని, జి.ఎస్.కే. టవర్స్ పార్కింగ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన గదులు తొలగించాలని, కోటకొమ్మల వీధిలో విధ్యుత్ దీపాలు పెంచాలని, ఐ.ఎస్.మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియాలో గుడి నిర్మాణన్ని ఆపాలని, న్యూ ఇందిరా నగర్ లో మురుగునీటి ప్రవాహం వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.


# 7 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి:ఎస్ఎఫ్ఐ

తిరుపతి విద్య, జూన్ 29 ప్రభాతవార్త




తిరుపతి జిల్లాలో పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో మెస్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమ వారం డిప్యూటీ స్పెషల్ కలెక్టర్‌కు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ, గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదువును కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన సుమారు రూ.7 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమలులో ఉన్న సాంకేతిక లోపాల కారణంగా అర్హులైన విద్యార్థులు సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అలాగే సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ప్రస్తుతం అమలులో ఉన్న మెస్ చార్జీలు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా లేవని, వాటిని పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, జిల్లా నాయకులు లతీఫ్, మహేష్‌లు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించడమే వైసీపీ లక్ష్యం - మాజీమంత్రి రోజా



పుత్తూరు రూరల్, జూన్ 29 ప్రభాతవార్త:

పుత్తూరు మండలంలోని ఉత్తరపు కండ్రిగ పంచాయతీ, కనకంపాళెం పరిధిలోని పోలింగ్ బూత్‌లలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియపై మాజీ మంత్రి రోజా, రాయలసీమ జోన్ బీఎల్ఏ అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి,నియోజకవర్గ ఎస్ఐఆర్ మానిటరింగ్ రాష్ట్ర లీగల్‌సెల్ సభ్యులు రవీంద్ర, టీమ్ సభ్యులు, వైసీపీ పార్టీ బూత్ కమిటీలు, మండల పరిశీలకులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్‌ల వారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ప్రజల నుంచి అందుతున్న అభ్యంతరాలు, ఓటరు జాబితాలో జరుగుతున్న మార్పులు, బీఎల్ఏలు చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మాజీమంత్రి రోజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ఆ హక్కుకు భంగం కలిగించే ఏ చర్యనైనా వైసీపీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అర్హులైన ఓటర్లకు అన్యాయం జరిగినా చట్టపరంగా పోరాడేందుకు పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాయలసీమ జోన్ బూత్ కమిటీలు అధ్యక్షుడు భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్‌లో పార్టీ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని, ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర లీగల్‌సెల్ సభ్యుడు రవీంద్ర, నియోజకవర్గ ఎస్ఐఆర్ మానిటరింగ్ టీమ్ సభ్యులు, మండల పరిశీలకులు, బీఎల్ఏలు పాల్గొని బూత్‌ల వారిగా కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.

# తిరుపతి డివిజన్

## అక్షయ క్షేత్రంలో మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



తిరుపతిరూరల్,జూన్ 29 ప్రభాతవార్త:

రాష్ట్ర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువనేత, చంద్రగిరి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిరూరల్ దుర్గసముద్రం సమీపంలోని అక్షయక్షేత్రంలో అనాథ పిల్లలు, వికలాంగులు, వృద్దులు మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం బ్రెడ్‌లు, స్వీట్స్, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి కుటుంబం ప్రజల ఆశీస్సులు, దేవుని అనుగ్రహంతో రాజకీయంగా మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. చంద్రగిరి ప్రజలకు కష్టసుఖాలలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి ఎల్లప్పుడూ అండగా నిలిచారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వారు చేసిన సేవలు విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యధర్శి రాజేంద్ర యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ సెంధిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యధర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిశేఖర్‌తో పాటు వెంకటేష్, భూపాల్, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేందర్‌రెడ్డి, వెంకట నాగరాజు, ప్రతాప్‌కుమార్, సాయి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా పౌర్ణమి పూజలు



నారాయణవనం, జూన్ 29 ప్రభాతవార్త :

మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్ర మాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. నెయ్యి, కొబ్బరినీరు, పశుపు, కుం కమ, చందనం, విభూది వంటి సుగంధద్ర వ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు పవిత్ర జలపాతంలో స్నానాలను చేసారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను పౌర్ణమి పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## జూలై 1న బిఎల్‌ఓలు, బిఎల్‌ఏల్‌తో సమీక్ష

### ఏఈఆర్ఓ దుద్దెల అమరేశ్వరి



చంద్రగిరి, జూన్ 29 ప్రభాతవార్త:

జూలై 1న చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో నిర్వహించే సమావేశానికి బిఎల్‌ఓలు, బిఎల్ఏలు తప్పక హాజరుకావాలని ఏఈఆర్ఓ, తహాశీల్దార్ దుద్దెల అమరేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశంలో ఏఎస్‌డి జాబితాల ధృవీకరణ, పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేయబడిన ఏఎస్‌డి ఓటర్ల జాబితాలపై క్షుణ్ణంగా చర్చించి తుది నివేధిక సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తి చేసే విధంగా క్షేత్ర స్థాయి ప్రగతిపై సమీక్షిస్తామన్నారు. ఈ సమీక్షలో సాదారణ ప్రజలు పాల్గొనవచ్చని అన్నారు. సమావేశ అనంతరం సం బంధిత నోటీసు, మీటింగ్ మినిట్స్, బిఎల్ఏలు సంతకం చేసిన ఏఎస్‌డి కాపీలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరబాట్లకు, తప్పులకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు, ప్రజాస్వామ్యయుతంగా జరిగే ఈ ప్రక్రియకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్‌స్థాయి ఏజెంట్లు, సహాకంలో హాజరై పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు.

## ఘనంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



చంద్రగిరి, జూన్ 29 ప్రభాతవార్త:

తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం చంద్ర గిరి టవర్ క్లాక్ వద్ద వైసిపి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భాణా సంఛా పేళుళ్లు, అభిమానులు, నాయకులు, కార్యకర్తల నినాదాల నడుమ కొటాల చంద్రశేఖర్ రెడ్డి కేక్‌కట్‌చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్‌తినిపించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళ్ళరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, బోస్ చంద్రారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మస్తాన్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిఖ్ భాషా, యారాశి చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసిపి వాలంటీర్స్ విభాగం మండల అధ్యక్షుడు సూరి, శానంబట్ల పృధ్వీ, మట్టి నవీన్‌కుమార్ రెడ్డి, కొత్తపాటి కోటిరెడ్డి, కొటాల రమేష్ రెడ్డి, మురగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు అవార్డులు



తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త:

కోటి ఆర్ట్స్ వార్షికోత్సవం సందర్భంగా రాయలసీమలో ఉన్నటువంటి కళాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో తిరుపతి కచ్చపి ఆడిటోరియం వేదికగా విశేష ప్రతిభ కనపరిచిన కళాకారులకు అవార్డులను పంపిణి చేసినట్లు కోటి ఆర్ట్స్ వ్యవస్థాపకుడు కోటి తెలిపారు. ఈ అవార్డు కార్యక్రమంలో రాయలసీమ, వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న కళాకారుల ప్రతిభను గుర్తించి, ముఖ్య అతిథులు గా విచ్చేసిన పసుపులేటి శివ ప్రసాద్, టిడిపి నాయకుడు నరసింహ ప్రసాద్ కళాకారులను సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో కోటి ఆర్ట్స్ డైరెక్టర్ కోటి, నిర్వాహకులు ధన, అభి, అవినాష్, హరిత, కేసవి తదితరులు పాల్గొన్నారు

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**- సీఎంకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి**



సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీసోమవారం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును అమరావతి సచివాలయంలో కలిసి వింత పత్రం అందజేశారు. సూళ్లూరుపేట మండల పరిధిలోని తూర్పుపల్లెలుగా పిలవబడే గ్రామాలకు అటకాని తిప్ప వద్ద నుంచి పేర్నాడు వరకు రోడ్డు నిర్మాణం చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే తీరప్రాంత ప్రజలైన కొరిడి, దామరాయి, కడప గ్రపంచాయతీల పరిధిలో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు కావడంతో పాటు విద్య, వైద్యంఇతర అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. అలాగే కాళంగి నదిపులికాట్‌లో కలిసే వాటంబేడు గ్రామం వద్ద గ్రాయన్ నిర్మించాలని అందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రాయన్ నిర్మిస్తేసముద్ర కోత నివారణ, తీర ప్రాంత రక్షణ, మత్స్యకారులను మెరుగైన జీవనోపాధిని కల్పించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ ప్రతిపాదన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధితశాఖ అధికారులతో చర్చించి పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



తడ, జూన్ 29 ప్రభాతవార్త : ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సూళ్లూరుపేట వారి ఆధ్వర్యంలో సోమవారం 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులకు జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల తడ నందు నగదు ప్రోత్సాహం ప్రశంసా పత్రాలను అందజేశారు. తడ మండలంలో ప్రథమ స్థానం సాధించిన అక్కంపేట మోడల్ స్కూల్ విద్యార్థి మోనిక వల్లికి 5,116రూపాయలు ద్వితీయ స్థానం సాధించిన చందనముడి సిరికి 4,116రూపాయలు తృతీయ స్థానం సాధించిన అక్కంపేట మోడల్ స్కూల్ విద్యార్థి సుస్మితకు 3,116రూపాయల నగదు పోర్చాహం అందించారు అదేవిధంగా మండలంలో అధిక మార్కులు సాధించిన ఐదు మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు సుమారుగా 47,668 రూపాయలను ఆచార్య భరద్వాజ్ సేవా సంస్థ నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆచార్య భరద్వాజ్ సేవా సంస్థ ప్రతినిధులను పాల్గొన్నారు.

## జూలై ఒకటి నుంచి క్రెడిట్ ఫెసిలిటీ సదుపాయం



సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వారితో పాటు విశ్రాంత ఉద్యోగులకు షార్ ఆసుపత్రిలో క్రెడిట్ ఫెసిలిటీ సదుపాయాన్ని జూలై ఒకటో తేదీ నుంచి కల్పించనున్నారు. ఇందుకు సంబంధించి షార్ విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం శ్రీహరికోటలో డైరెక్టర్ ముత్తు చలియన్‌ను కలిసి సన్మానించారు. షార్ కుటుంబ సభ్యులకు క్రెడిట్ ఫెసిలిటీ కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా షార్ విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ షార్ ఆసుపత్రిలో కాకుండా వెలుపల మందులు కొనుగోలు చేసేందుకుసొంత డబ్బులు వ్యయం చేసే అవసరం ఉండదని చెప్పారు. ఈ క్రెడిట్ ఫెసిలిటీ ఇప్పటికే విఎస్ఎస్‌సి, సిజిహెచ్ఎస్ ఆరోగ్య పథకాలలో అమలు ఉందన్నారు ఈ సౌకర్యాన్ని ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,ఒడిశా,తమిళనాడు రాష్ట్రాల్లోని అపోలో ఫార్మసీల ద్వారా జులై ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో బిల్లుల రీయంబర్స్మెంట్ ఇబ్బందులను ఈ విధానంతో తొలగించుకోవచ్చని విశ్రాంత ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. శ్రీహరికోట ఉద్యోగ కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పౌర్ణమి పూజలకు కదలి వచ్చిన జనం: ఊంజల్‌సేవతో పునీతం





శ్రీకాళహస్తి,జూన్ 29 (ప్రభాతవార్త): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి ఊంజల్ సేవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసి ఊరేగింపుగా కోట మండపం నాలుగుకాళ్ళ మండపం వద్ద చేర్చారు. అక్కడ సోమస్కంద మూర్తిని కోట మండపంలో దేవేరిజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని నాలుగుకాళ్ళ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయల్లో ప్రతిష్టించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్లను ఊయలలో సేవల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి.కె.వెంకటేశులు, చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, సభ్యులు కోలా వైశాలి, గుర్రప్పశెట్టి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**పౌర్ణమి పూజలకు తరలి వచ్చిన భక్తులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు సోమవారం ఉదయం నుంచి ఆలయంలో పూజలు, సేవలకు కదలి వచ్చారు. ముఖ్యంగా సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు నిర్వహించే అభిషేకాల్లో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. రాహుకేతుదోష నివారణ పూజలకు రాహుకాల సమయంలో తరలివచ్చారు. అయితే ఆన్ లైన్ కష్టాలున్నా భక్తులు సర్దుకున్నారు.ప్రత్యేక హెల్పింగ్ డెస్కులు ఏర్పాటు చేశారు. అయితే భక్తులు ప్రసాదాలు సంబంధించి ఆన్‌లైన్ అంటే చాలా ఇబ్బందిగా ఉందని కౌంటర్లు వేయకనే వెళుతున్నారు.సోమవారం అధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు వివరించారు. కాగా అభిషేకాలు 60 జరిగాయి. సోమవారం విశేషంగా నిర్వహించే మృత్యుంజయ స్వామి అభిషేకాలకు ఆదరణ లభిస్తుంది. సోమవారం 13 అభిషేకాలు జరిగాయి. సోమవారం సాయంత్రం నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 31 జరిగాయి. దీనిని బట్టిచూస్తే ఆలన్‌లైన్‌లో అయినా భక్తులు బుక్ చేసుకుంటున్నారు.ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా సుమారు 5300 జరిగాయి.ప్రసాదాలు సుమారు 18వేలు విక్రయించినట్లు సమాచారం.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇటీవల నిర్వహించిన టెన్త్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులను సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలకు రక్షణ కల్పించే ప్రక్రియలో భాగంగా ట్రీ గార్డ్స్‌ను ఏర్పాటు చేసి,రక్తదాతలకు సంబంధించిన ఫ్లెక్సీలను అందజేశారు. వృద్ధాశ్రమంలో ప్రథమ చికిత్స కిట్లను,ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్లను ముద్రించి ఫ్లెక్సీ ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగింది. అలాగే గోశాల నిర్వాహకులకు ఆకుకూరలు, బెల్లం, ఎండు గడ్డి, అరటి పండ్లు గోవులకు ఆహారంగా అందజేసేందుకు వాసవి వనిత క్లబ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్‌కు చెందిన సుజాత, రమేష్ బాబు, కామాక్షి, సాయిరాం, బాలకృష్ణ, ఆర్ సుబ్రహ్మణ్యం, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాలమ్మ దేవస్థానంలో చండీయాగం



సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాలమ్మ దేవస్థానంలోచండీయాగాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో గోమాతకు పూజలు చేసిన అనంతరం చండియాగాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు మధ్య ఉదయం ప్రారంభమైన చండీ యాగం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. దేవస్థాన సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో నాయుడుపేటకు చెందిన ఒడూరు కృష్ణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## అట్టహాసంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**-300 కేజీల భారీ కేక్ కటింగ్... వేలాదిగా తరలివచ్చిన నాయకులు**



తిరుపతిరూరల్,జూన్ 29 ప్రభాతవార్త: రాష్ట్ర వైయస్సార్‌సిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం తుమ్మల గుంటలో అట్టహాసంగా జరిగాయి. ఉదయం నుంచే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలపడంతో ఆయన నివాసం జనసంద్రమైంది. చంద్రగిరి నియోజకవర్గం అంతటా ఫ్లెక్సీలు, బ్యానర్లతో వేడుకల శోభ పెరిగింది. తుమ్మలగుంటలో తెలుగుతల్లి విగ్రహం నుంచి నివాసం వరకు ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. పుష్పాలంకరణతో ప్రత్యేకంగా అలంకరించిన నివాసంలో అతిథుల కోసం విస్రృత ఏర్పాట్లు చేశారు.

**భూమన చేతుల మీదగా కేక్ కటింగ్:**

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి వేడుకలకు హాజరై మోహిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భూమన చేతుల మీదగా 300కేజీల భారీ కేక్‌ను కట్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేక్‌పై మోహిత్‌రెడ్డి చిత్రాన్ని ఆర్షణీయంగా రూపొందించిన నిర్వాహకులను అభినందించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు ఇన్‌చార్జ్ విజయనందరెడ్డి ఈ వేడుకలకు హాజరై మోహిత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతి నిధులు వేలాది మంది కార్యకర్తలు పాల్గొని వేడుకలకు మరింత ఊతమిచ్చారు. మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుత్తణి ఆలయాల నుంచి వేద పండితులు తరలివచ్చి వేద ఆశీర్వచనాలు అందించారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ కార్యక్రమం వేడుకలకు ఆధ్యాత్మిక మెరుగు చేకూర్చింది.

**వేలాది మందికి విందు భోజనం:**

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలకు వస్రృతంగా వంటకాలు సిద్ధం చేశారు. సుమారు 20వేల మందికిపైగా భోజనాలను పంఫిణి చేయడం విశేషం. ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా పసందైన వంటకాలు వడ్డించారు. మోహిత్‌రెడ్డిని వైకాపా నాయకులు, అభిమానులు బోకేలు, శాలువాలతో మోహిత్‌రెడ్డిని సత్కరించి, అభిమానాన్ని చాటుకున్నారు.

## సూళ్లూరుపేటలోజేష్ట పౌర్ణమి పూజలు



సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో జేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అభయ శంకర దేవస్థానం, శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివునికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. నాగేశ్వర స్వామి దేవస్థానంలో చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, సహస్ర విష్ణునామ పరాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభయ శంకర దేవస్థానంలో ఆకుతోట రమేష్ పర్యవేక్షణలో అర్చకులు రమణయ్య ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పూజా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివయ్యను దర్శించుకున్నారు.

## గరుడ వాహనంపై చిద్విలాస శ్రీనివాసుడు



చంద్రగిరి, జూన్ 29 ప్రభాతవార్త: శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై చిద్విలాసంతో శ్రీనివాసుడు తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ పండు వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అసిస్టెంట్ దిలీప్‌కుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, కళ్యాణ సుందరం, జమేధర్ భువనేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి

**- డిసిసిబి ఛైర్మన్ అమాసతో కలసి మొబైల్ ఎటిఎం వాహనాలను ప్రారంభించిన కలెక్టర్**



చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: జిల్లా కేంద్ర సహకార బ్యాంకును బలోపేతం చేసుకోవడానికి డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డిసిసిబి అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. సహకార వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం ఆవరణలో కలెక్టర్ సుమిత్‌కుమార్ డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డితో కలిసి మొబైల్ ఎటిఎం వాహనాలను ప్రారంభించి, సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ డిసిసిబి బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటి అనంతరం జిల్లా సహకార రంగ అభివృద్ధి, రైతులకు మెరుగైన రుణ సదుపాయం, బ్యాంకుల ఆర్థిక స్వావలంబన, రుణాల వసూళ్ళు, ఎన్‌పిఎల నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకులు సేకరించిన డిపాజిట్లలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వాటా కేవలం 3.20 శాతం మాత్రమే వుందని, అయితే రుణాల పంపిణీలో మాత్రం 5.25 శాతం వాటాను కలిగి వుందన్నారు. ఫలితంగా డిసిసిబి రైతులకు రుణాల పంపిణీ కోసం రాష్ట్ర సహకార బ్యాంకు, నాబార్డు వంటి సంస్థలపై అధికంగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. డిపాజిట్లను మరింత పెంచడం ద్వారా బ్యాంకు స్వంత వనరులు బలోపేతం అవుతాయని, తద్వారా బయటి సంస్థలపై ఆధారపడకుండా రైతులకు అవసరమైన సమయంలో విరివిగా రుణాలు అందించే అవకాశం కలుగుతుందన్నారు. సహకార బ్యాంకులపై ప్రజల విశ్వాసం మరింత పెంపొందించేలా పారదర్శకత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. డిపాజిట్ల సేకరణలో ప్రజా ప్రతినిధులు, సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహకారం వుంటుందని, అలాగే అవసరమైన సమన్వయం కోసం జిల్లా అధికార యంత్రాంగం నిత్యం అందుబాటులో వుంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిలు 'సహకారంతో సమృద్ధి' అనే లక్ష్యంను సకారం చేయడానికి సహకార రంగంను అభివృద్ధికి కృషి చేస్తామని డిసిసిబి ఉద్యోగులు, సిబ్బంది, సింగిల్‌విండో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగులు, సహకార సంఘాల ప్రతినిధులతో కలెక్టర్, డిసిసిబి ఛైర్మన్ కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో వున్న 71 సింగిల్‌విండోలకు డివిడెంట్ రూపంలో రూ.3.51 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి లక్ష్మీ, నాబార్డు డిపిఎం చంద్రశేఖర్, డిసిసిబి సిఇఓ శంకర్‌బాబు, జిల్లా సహకార ఆడిట్ అధికారిణి ఎస్ఎంఎం నారాయణమ్మ, డిసిసిబి డిజిఎంలు జెఎం లిల్లీక్యాథరీన్, కె.వెంకటాచలపతి, ఎం.సురేష్‌బాబులు, ఎజిఎంలు, బ్యాంకు ఉద్యోగస్తులు, సహకార సంఘ ఉద్యోగులు, సహకార సంఘ నాన్ ఆఫిషియల్ సభ్యులు, సహకార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణయ్యకు జన భూషణ్ అవార్డు ప్రధానం




వెంకటగిరి, జూన్ 29 ప్రభాతవార్త: పట్టడానికి చెందిన విశ్రాంత ఎక్సైజ్ సీఐ తోటా కృష్ణయ్యకు ప్రతిష్టాత్మక జల భూషణ్ అవార్డును తిరుమల తిరుపతి దేవస్థానం వారి సౌజన్యంతో, రాయలసీమ రంగస్థలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణదేవరాయ కళాదర్బార్ వారు బహుకరించారు. ఈ గౌరవాన్ని అందించిన కృష్ణదేవరాయ కళాదర్బార్, రాయలసీమ రంగస్థలి సంస్థలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. అలాగే సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డికి, కార్యదర్శి కె.ఎన్. రాజా నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అవార్డు మాపై మరింత బాధ్యతను పెంచి, సమాజ సేవలో ఇంకా అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

## సర్ కార్యక్రమానికి దరఖాస్తుల కొరత తీర్చండి



వెంకటగిరి, జూన్ 29, ప్రభాతవార్త: సర్ కార్యక్రమానికి దరఖాస్తుల కొరత తీవ్రంగా ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఏ విభాగం అధ్యక్షులు ఆర్ శంకరయ్య తెలిపారు. సర్ కార్యక్రమానికి దరఖాస్తుల కొరత చేర్చాలని ఆయన మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. 14 వ వార్డులో ఎక్కువ శాతం మందికి బిఎల్వోలు దరఖాస్తులు ఇవ్వలేదని తెలిపారు. 100 పారాల అందినట్లు అధికారులు చెబుతున్నారని నిజానికి 60 శాతం కూడా అందలేదన్నారు. పట్టణాల్లో 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఒక వార్డుకు 1000 నుండి 1500 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. బిఎల్‌వోలకు ఒక అసిస్టెంట్లు పెట్టి అందరికీ దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 332 అర్జీలు



తిరుపతి కలెక్టరేట్, జూన్ 29 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టీ పరిష్కార దిశగా కృషి చేయాలని డిఆర్ఓ నరసింహులు తెలిపారు.సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్ భరత్ నాయక్ రోస్మండ్ తో కలిసి అర్జీ దారుల నుంచి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి డిఆర్ ఓ వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డి ఆర్ ఓ మాట్లాడుతూ.. పరిష్కారం కోసం వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్జీల పరిష్కారంలో నిరక్ష్యం ప్రదర్శించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్ పి.జి.ఆర్.ఎస్‌కు 71 ఫిర్యాదులు

తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త:సోమవారం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదుదారుల నుండి వినతులను పోలీస్ అధికారులు స్వీకరించారు. ఓర్పుగా ప్రతి సమస్యను నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు వేగవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుదారుడికి తగిన న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి పిటిషన్‌ను వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి మొత్తం 71 పిటిషన్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ రమణ ,పి.జి.ఆర్.ఎస్. సీఐ సుదర్శనరావు సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై సత్వర స్పందన అవసరం

**-ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**




తిరుపతి, జూన్ 29 ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులు నిర్వహించాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి ఆదేశించారు. సంస్థలో అవినీతిపై ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు, పాడైపోయిన విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడే విద్యుత్ తీగలను సరి చేయడం, లో వోల్టేజ్ తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## పదోన్నతపై మండలానికి నలుగురు డిజిటల్ అసిస్టెంట్‌లు

బాలాయపల్లి, జూన్ 29 ప్రభాతవార్త: పదోన్నతిపై నలుగురు డిజిటల్ అసిస్టెంట్ల నియామకం జరిగిందని ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. పిగిలం సచివాలయంకు ఏ.మునిరేఖ, కాలగంధకు శివ సాయి, భైరవరం సచివాలయంకు ఎస్ సునీత, సంగవరంకు ఎస్ ప్రవీణ్‌ను నియమించినట్లు వివరించారు. నలుగురు డిజిటల్ అసిస్టెంట్‌లో వరుకుంటపాడు, దుత్తలూరు, వెంకటగిరి, మండలం నుండి పదోన్నతిపై వచ్చినట్లు వివరించారు.

## సజీవంగా కనిపిస్తున్న తైల వర్ణ చిత్రాలు




రేణిగుంట, జూన్ 29 ప్రభాతవార్త: రేణిగుంట మండలం మర్రిగుంట సమీపంలోని పాపానాయుడుపేట క్రాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చిత్రీకరించిన గుడిమల్లం శ్రీ ఆనందవల్లి సమేత శ్రీ పరశురామేశ్వర స్వామి తైల వర్ణ చిత్రాలు జీవ కళ ఉట్టిపడుతూ అందరిని ఆకర్షిస్తున్నాయి. మర్రిగుంట నేషనల్ హైవే నుండి దాదాపు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో గుడిమల్లం అతి ప్రఖ్యాత శివాలయం ఉందని తైల వర్ణ చిత్రం మార్గాన్ని సూచిస్తుంది. బ్రిడ్జికింద నాలుగు వర్ణచిత్రాలను బ్రిడ్జికి రెండు వైపులా సజీవ కళ ఉట్టిపడేలా గుడిమల్లం దేవస్థానం చైర్మన్ బత్తల గిరినాయుడు చిత్రకారులతో దగ్గరుండి చిత్రాలను చిత్రీకరింపజేశారు. దీనివల్ల బ్రిడ్జి గోడలు అసభ్యకరమైన రాతలు రాయకుండా, అస్లీల పోస్టర్లు తగిలించకుండా ఆధ్యాత్మికత గోచరించే విధంగా భక్తులను ఆకర్షిస్తున్నాయి.